మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 121 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## ధరణి పేరుతో దగా



- పోర్టల్ వల్ల నాడు గుంట భూమి కూడా అమ్ముకోలేని దుస్థితి
- ప్రైవేట్ కంపెనీకి అప్పగించడంతో సమస్యలు తీవ్రం
- విదేశీ కంపెనీ చేతిలో తెలంగాణ భూముల వివరాలు
- బీఆర్ఎస్ నిర్వాకంతో రైతులకు శాపంగా మారింది
- ధరణిని భూమాతగా మార్చడంపై పొంగులేటి వివరణ

హైదరాబాద్, (ప్రజా మంటలు): ధరణి స్థానంలో భూమాతను తీసుకుని వస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కేబినేట్ ఆమోదంతో దీనిపై అసెంబ్లీలో చర్చ జరిగింది. ధరణితో గుంట భూమి కూడా అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడిందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో పొంగులేటి ధరణి పై మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం మిగతా 2లో..

# జాబ్ క్యాలెండర్ వచ్చేసింది...



- అసెంబ్లీలో ప్రకటించిన డిప్యూటీ సీఎం భట్టి
- నోటిఫికేషన్లు, పరీక్ష తేదీల వివరాల ప్రకటన
- మహమ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగాలు
- గతంలో అస్తవ్యస్త విధానాలతో నిరుద్యోగులకు నిరాశ
- ఇచ్చిన హామీ మేరకు ముందుకు వెళుతున్నామని వెల్లడి

హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఏయే ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేయాలనే విషయాలను క్యాలెండర్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసే నెల, పరీక్షలు ఎప్పుడు నిర్వహించాలనే వివరాలతో పాటు నియామకాలు నిర్వహించే ఏజెన్సీ, ఉద్యోగానికి కావాల్సిన అర్హతల గురించి అందులో పొందుపర్చారు. ఈ మేరకు జాబ్ క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రకటించారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-1 పరీక్షలు అక్టోబరులో, గ్రూప్-2ను డిసెంబరులో, గ్రూప్-3 నవంబరులో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్దం పాటు అధికారంలో ఉన్నా, నిరుద్యోగులకు న్యాయం జరగలేదన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేయడంలో భాగంగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రెండు సార్లు గ్రూప్ 1 ఎగ్జామ్ రద్దు అయిందని, ఉద్యోగాల భర్తీ ప్రక్రియ గందరగోళంగా మార్చారని ఆరోపించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ ఐఏఎస్ లతో రెండు కమిటీలు ఏర్పాటు చేసి, వారి సూచనల్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. పాత గ్రూప్ 1 నోటిఫికేషన్ రద్దు చేసి, 60 కొత్త పోస్టులతో మొత్తం 563 పోస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్ 1 నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రూప్ 1 ప్రిలిమినరీ ఎగ్జామ్ కు 3 లక్షల మంది హాజరుకాగా, పరీక్ష సజావుగా నిర్వహించి ఫలితాలు ప్రకటించామన్నారు. అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్ 1 మెయిన్స్ ఎగ్జామ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఒక లక్షా 45 వేల 368 మంది హాస్టల్ వేల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలకు, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ ఎగ్జామ్ కు 1 లక్షా 6 వేల 2 వందల 60 మంది హాజరుకాగా, విజయవంతగా నిర్వహించాం. 32 వేల 4 వందల 10 మందికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు జారీ చేశాం. అదనంగా 13,500 ఉద్యోగ ఖాళీల భర్తీకి అనుమతులు ఇచ్చాం. 11 వేల 62 ఖాళీలతో టీచర్ రిక్రూట్ మెంట్ కోసం డీఎస్సీ ఎగ్జామ్ ప్రకటించాం. జులై 18న ప్రారంభమై ఆగస్టు 5న ముగియనున్నాయి. 465 సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఖాళీల భర్తీకి, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ లో 45 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశాం. పరీక్షల ప్రిపరేషన్ కు తగినంత సమయం లేదని అభ్యర్థులు కోరడంతో ఆగస్టు నుంచి డిసెంబర్ కు గ్రూప్ 2 ఎగ్జామ్ వాయిదా వేశాం. పరీక్షా తేదీలు ఒకటే కాకుండా, పరీక్షల మధ్య ప్రిపరేషన్ కు సమయం ఉండేలా అన్ని నియామక బోర్డులు ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నాయని భట్టి విక్రమార్క ప్రకటించారు. గత ప్రభుత్వం నిర్వహించిన నియామక పరీక్షల పేపర్లు లీకయ్యాయి, పేపర్ల అమ్మకంతో పరీక్షలు రద్దయ్యాయి. పేపర్ లీక్ కారణంగా 2023 మార్చి 17న తొలిసారి గ్రూప్ 1 ఎగ్జామ్ రద్దయింది. అభ్యర్థుల బయో మెట్రిక్ తీసుకోని కారణంగా హైకోర్టులో రెండోసారి ఎగ్జామ్ రద్దు అయింది. ప్రస్తుతం ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిరుద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నాం. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసి, కొత్త చైర్మన్ ను నియమించి మిగతా 2లో..

## నాపై దాడులకు ఈడీ రెడీ అవుతోంది

- రాహుల్ ఆరోపణ
- రాహుల్ జోలికి వస్తే ఊరుకునేది లేదు
- శివసేన ఎంపీ



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
తనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు చేయాలని కుట్ర పన్నుతున్నట్లుగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం ఆరోపించారు.కాగా ఆయన వ్యాఖ్యలపై శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది స్పందించారు. రాహుల్ గాంధీ ఇంటికి దర్యాప్తు సంస్థలు వెళ్తే కూటమి భాగస్వాములు చూస్తూ ఉండరని.. కలసికట్టుగా వాటిపైకి ఎదురు తిరుగుతారని అన్నారు.లోక్‌సభ ఎన్నికల ఫలితాల ద్వారా ప్రజలు బుద్ధి చెప్పినా భాజపా ఎటువంటి పాఠాలు నేర్చుకోలేదని అసహనం వ్యక్తంచేశారు. ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకొని కేంద్రం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తుందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా దర్యాప్తు సంస్థలు చేపడుతున్న చర్యలను ప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు.సోమవారం బడ్జెట్ 2024-25పై లోక్‌సభలో జరిగిన చర్చలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఆరుగురు వ్యక్తులు దేశం మొత్తాన్ని 'పద్మ వ్యూహం' లోకి నెట్టివేస్తున్నారని ధ్వజమెత్తారు. మహాభారతం లోని కురుక్షేత్ర సంగ్రామంలో పద్మవ్యూహాన్ని, వీరమరణం పొందిన అభిమన్యుడిని ప్రస్తావిస్తూ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తదితరులపై విమర్శలు సంధించారు. "అభిమన్యుడిని పద్మవ్యూహంలో బంధించి ఎలాగైతే హత్య చేశారో... ఇప్పుడు దేశాన్నీ అదే చేయబోతున్నారు. యువత, రైతులు, మహిళలు, చిన్న, మధ్యతరహా వ్యాపారుల చుట్టూ వ్యూహం పన్నుతున్నారు. ఈ రోజు కూడా వ్యూహం పన్నిన వారి లో ఆ ఆరుగురే ఉన్నారు" అని పేర్కొన్నారు.కాగా ఈ విషయంపై శుక్రవారం ఎక్స్ వేదికగా రాహుల్ మాట్లాడుతూ "సాధారణంగానే ప్రతీ ఇద్దరిలో ఒకరికి నా 'పద్మవ్యూహం' ప్రసంగం నచ్చలేదు. నాపై సోదాలకు సిద్ధమవుతున్నట్లు ఈడీలో పనిచేస్తున్న కొంతమంది వ్యక్తులు తెలిపారు. వారిని ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉన్నా" అని పేర్కొన్నారు.

### పాలీట్రిక్స్

నమోజీ బడ్జెట్లో రాష్ట్రాల
అస్తిత్వమే 'అదృశ్యం',
దోస్తులకే ప్రాధాన్యత
దేవదూతకది 'ఆవశ్యం' !

పక్షపాత 'వైఖరి'కి దక్కునా
ప్రజల చెంత పరపతి ,
'పాలకుల'కు తెలియనిదా
పరిపాలన రాజనీతి ?

-న్యాలకంటి నారాయణ
9346200066

## హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

- సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, (ప్రజా మంటలు):
నగరంలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. బేగరికంచలోని స్కిల్ యూనివర్సిటీకి సమీపంలో ఈ నిర్మాణం చేపడతామని తెలిపారు. దీనిపై బీసీసీఐతో ప్రాథమిక చర్చలు పూరి చేశామన్నారు. శాసనసభలో సీఎం మాట్లాడారు.రాష్ట్రంలో క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. త్వరలో స్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తామన్నారు. దీనికోసం హరియాణా విధానాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. క్రీడల కోసం బడ్జెట్‌లో రూ.321కోట్లు కేటాయించామన్నారు. యూసుఫ్‌గూడ, గచ్చిబౌలి, సరూర్‌నగర్ స్టేడియాల్లో క్రీడలు తగ్గాయని చెప్పారు. ఎల్బీ స్టేడియంలో క్రీడలు తగ్గి.. రాజకీయ మిగతా 2లో..


## రాష్ట్ర భవిష్యత్తు టీచర్ల చేతుల్లోనే



- సర్కారు బడికి పిల్లల్ని పంపండి
- కార్పోరేట్ విద్య అందిస్తాం
- మౌళిక సదుపాయాలు కల్పిస్తాం
- టీచర్లే మా బ్రాండ్ అంబాసిడర్లు
- తెలంగాణ సాధనలో వారి పాత్ర కీలకం
- 25వేలమందికి పదోన్నతులు కల్పించాం
- ఒకటో తేదీన జీతాలు పడేలా చేస్తున్నాం
- పేదల చదువుతోనే తెలంగాణకు భాగ్యం
- సర్కారీ బడికి వెళ్లడం ఆత్మగౌరవంగా భావించాలి
- ఎల్బీ స్టేడియంలో ఉపాధ్యాయులతో భేటీలో సీఎం రేవంత్

హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ భవిష్యత్ ఎక్కడుందని ఈ క్షణం తనను అడిగితే వేలాది మంది ఉపాధ్యాయుల రూపంలో ఎల్బీ స్టేడియం లో ఉందని చెబుతానని ఉద్ఘాటించారు. ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నాడు 30 వేల మంది ఉపాధ్యాయులతో సీఎం రేవంత్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఉపాధ్యాయులే తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్‌లు అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 25వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాం. 30 వేల మందిని బదిలీ చేశాం. మిగతా 2లో..

## ప్రజా నాడి




## జాబ్ క్యాలెండర్ సరే..జాబులెన్నో చెప్పండి

- గన్‌పార్కు వద్ద భారాస నిరసన



హైదరాబాద్, (ప్రజా మంటలు):
మార్పు మార్పు అంటూ తెలంగాణ ప్రజలను ఎక్కువ రోజులు ఏమార్చలేరని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తప్పకుండా ప్రజలు తిరగబడే రోజు వస్తుందని హెచ్చరించారు. జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగాల సంఖ్య ప్రకటించకుండా నిరుద్యోగులను మోసం చేశారని మండి పడ్డారు. హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆయన నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దమ్ముంటే అశోక్‌నగర్‌కు వచ్చి.. నువ్వు ఇచ్చిన జాబ్ క్యాలెండర్ కరెక్ట్ అని చెప్పమని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డికి సవాలు విసిరారు. ఈ 8 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఉద్యోగం ఇచ్చిందని అక్కడ ఉన్న నిరుద్యోగులతో చెప్పించాలన్నారు. అలా చేస్తే మేమందరం రాజీనామా చేస్తామని సవాలు విసిరారు. రెండు లక్షల ఉద్యోగాలు బోగస్ అని కేటీఆర్ అన్నారు. ఈ విషయం మీకు కూడా తెలుసని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి అన్నారు. మీరిచ్చిన జాబ్ క్యాలెండర్ బోగస్ అని తెలుసు.. అయినా కూడా పిల్లల్లో ఉద్వేగాల్ని రెచ్చగొట్టేవిధంగా లేని ఒక వాతావరణం నిర్మాణం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మీ క్యాలెండర్ బోగస్.. అందులో ఉద్యోగాలే లేవు. అందులో తారీఖులు తప్ప ఏమీ లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్‌పై చర్చ పెట్టమంటే రాష్ట్ర ప్రభుత్వం పారిపోయిందని ఎద్దేవా చేశారు. సిగ్గులేకుండా మళ్లీ మా ఎమ్మెల్యేలను సాటి ఎమ్మెల్యేతో ఒక బజారు భాషలో తిట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి, శాసనభకు చీకటి రోజు అని ఆయన వ్యాఖ్యానించారు. దుర్మార్గమైన పద్ధతిలో మిగతా 2లో..

## సభలో దానం అన్‌పార్లమెంటరీ భాష

హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ దురుసు ప్రవర్తన చూపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అన్‌ప్లామెంటరీ భాష వాడారు అయితే దానం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సభ్యులతో పాటు ఇతర శాసనసభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో దిగొచ్చి క్షమాపణలు చెప్పారు.ఈ క్రమంలోనే మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ కూడా దానం నాగేందర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నీ అమ్మ అని మాట్లాడటం కరెక్ట్ కాదని హితవు పలికారు. సభలో ఎవరూ నోరు జారవద్దు.. సహనంతో ఉండాలని సూచించారు. జనాలకు రాంగ్ మెసేజ్ వెళ్తుందని.. ఆ వ్యాఖ్యలపై దానం నాగేందర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.శాసన సభ్యుల నుంచి తీవ్రమైన స్పందన రాగా, స్పీకర్ జోక్యం చేసుకోవడంతో దానం నాగేందర్ క్షమాపణలు చెప్పారు. ఎవరినైనా బాధ పెట్టి ఉంటే విచారం వ్యక్తం చేస్తున్నా అని అన్నారు.తానెప్పుడూ పరిధి దాటలేదని.. తన పనితీరు గురించి అందరికీ తెలుసని అన్నారు.

**రికార్డులు పరిశీలించి తొలగిస్తాం..**

దానం నాగేందర్ వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత రావడంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా స్పందించారు. అసభ్య పదజాలం వాడివుంటే.. రికార్డులు పరిశీలించి తొలగిస్తామని స్పష్టం చేశారు. సభ్యులు తమ హక్కులను వినియోగించుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ సూచించారు.

మొదటి పేజీ తరువాయి

# జాబ్ క్యాలెండర్ సరే.. జాబులెన్నో చెప్పండి

## - గన్‌పార్కు వద్ద భారాస నిరసన

నిన్న, మొన్న మా అక్కల్ని అవమానించారని.. ఇవాళ ఒక సభ్యుడు అమ్మ, అక్క అని తిడుతుంటే శాడిస్టు మాదిరిగా ముఖ్యమంత్రి పైశాచిక ఆనందం పొందుతూ అందర్నీ ఉసిగొల్పుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఒక శాడిస్టు ముఖ్యమంత్రిలా వ్యవహరిస్తున్నారని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి తప్పకుండా తెలంగాణ యువత తప్పకుండా రేవంత్ రెడ్డికి తగు రీతిలో సమాధానం చెబుతుందని హెచ్చరించారు.. ఎక్కువ రోజులు డ్రామా నడవదని స్పష్టం చేశారు. ఈ ఐదారు రోజుల శాసన సభ సమావేశాల్లో ప్రభుత్వం తేలిపోయిందని కేటీఆర్ అన్నారు. గవర్నమెంట్‌లో విషయం లేదు.. కేవలం ఊదరగొట్టే ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఏమీ లేవని తేలిపోయిందని కాబట్టే ఈ బజారు భాషతో మమ్మల్ని రెచ్చగొడు తున్నారని తెలిపారు. మంచిగా మాట్లాడుతుంటే కావాలనే ఉసిగొల్పి ప్రజల దృష్టి మరల్చే ఒక చీప్ టాక్టిక్స్‌కు చేస్తున్నారని మండిపడ్డారు. ఈయన చీఫ్ మినిస్టర్ కాదు.. చీప్ మినిస్టర్ అని ఎద్దేవా చేశారు. ఒక శాడిస్టు ముఖ్యమంత్రిగా పైశాచిక ఆనందం పొందుతూ.. ఆడబిడ్డలను అవమానిస్తూ.. ఎమ్మెల్యేలను బూతులు తిట్టిస్తూ ఇష్టమొచ్చినట్టు ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని అన్నారు. అందుకే అసెంబ్లీలో నిరసన చెప్పి బయల్దేరి గన్‌పార్క్ వద్దకు వచ్చి.. మా శాసన సభ్యులు, మండలి సభ్యులు అందరం వచ్చి మా నిరసన చెబుతున్నామని పేర్కొన్నారు. ఇకపోతే హైదరాబాద్ మీద కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి అబద్దాలు చెబుతుందని కేటీఆర్ మండిపడ్డారు. ఆ విషయంలో కూడా తప్పకుండా ప్రభుత్వాన్ని తూర్పార పడుదామని అనుకున్నామని చెప్పారు. కానీ బజారు భాషలో మాట్లాడేసరికి మా అక్క కోవ లక్ష్మి దుఃఖం ఆపుకోలేక.. తమను బయటకు తీసుకొచ్చారని తెలిపారు. ఈ శాసనసభలో తెలంగాణ ప్రజలకు న్యాయం చేసే ముచ్చట్లు లేవని.. కేవలం కాంగ్రెస్ పార్టీ డ్రామాలు, కాంగ్రెస్ పార్టీ నాటకాలు తప్ప ఏమీ లేవని మండిపడ్డారు. అప్పులు, అప్పులు అని ఇన్ని రోజులు తప్పుడు కూతలు కూశారని చెప్పారు. అప్పులు లేవు.. ఈ రాష్ట్రం రెవెన్యూ సర్‌ప్లస్ స్టేట్ అని మేం ఎస్టాబ్లిష్ చేస్తే ఇవాళ నోరు మూసుకున్నారని తెలిపారు. అనేక విషయాలను డైవర్ట్ చేయడానికే మా అక్కల మీద నోరుపారేసుకుని.. కావాలని ప్రజల దృష్టి మరల్చే ఓ చిల్లర ప్రయత్నం చేస్తున్నాడు.. ఈ చిల్లర ముఖ్యమంత్రి అని మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని గ్రహించాలని తెలంగాణ ప్రజలను విజ్ఞప్తి చేశారు. జాబ్ క్యాలెండర్‌పై అసెంబ్లీలో చర్చించాలని అడిగితే రెండు నిమిషాలు కూడా టైమ్ ఇవ్వలేదన్నారు. నాలుగు పేపర్ల మీద ఇష్టం వచ్చింది రాసుకొచ్చి జాబ్ క్యాలెండర్ అంటున్నారని విమర్శించారు. తెలంగాణ శాసనసభ దుశ్శాసనసభగా మారిందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి కాంగ్రెస్ గెలిచింది. అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్ ఇస్తామని ప్రకటనలు చేశారు.

# రాష్ట్ర భవిష్యత్తు టీచర్ల చేతుల్లోనే

ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు మీ ఖాతాలో పడేలా చూసే బాధ్యత మాది. ఈ సమ్మేళనంలో రాజకీయం, స్వప్రయోజనం లేదు. తెలంగాణ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని అన్నారు. పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడం ఆత్మగౌరవం అని తల్లిదండ్రులు భావించాలి. అందుకు అందరం కలిసి కృషి చేయాలి. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమిస్తాం. పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తాం.. ఆ బిల్లు ప్రభుత్వమే చెల్లిస్తుంది. పేద పిల్లలు, దళిత వర్గాల పిల్లలు చదువుకుని బాగు పడితేనే రాష్ట్రం బలపడుతుంది. దిల్లీలో మూడుసార్లు కేజ్రీవాల్ గెలిచింది బస్తీల్లో పాఠశాలలు మెరుగుపరచడం వల్లే. మళ్లీ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఉండాలంటే మీరు పేదలకు చదువు చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ బడుల్లోనే చదువుకుని తాను ఈ స్థాయికి వచ్చానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 30వేల ప్రభుత్వ పాఠశాలల్లో 26లక్షల మంది విద్యార్థులు ఉన్నారని... తల్లిదండ్రులు వారి భవిష్యత్‌ను ఉపాధ్యాయుల చేతుల్లో పెట్టారని వివరించారు. రాష్ట్రం వస్తే విద్యా విధానం బాగుపడుతుందనుకున్నాం.. ఉపాధ్యాయుల గౌరవం పెరుగుతుందనుకున్నామని చెప్పారు. కోదండరాం, హరగోపాల్, చుక్కా రామయ్య లాంటి వాళ్లకు గొప్ప గౌరవం దక్కుతుందని అనుకున్నామని కానీ తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఏం జరిగిందో చూశామని అన్నారు. గత పాలకులు ఉపాధ్యాయు లను ఏ విధంగా అవమానించారో చూశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ బడ్జెట్‌లో విద్యకు 10శాతం కేటాయించాలని భావించాం. కానీ హామీల అమలు దృష్ట్యా 7.3శాతం అంటే రూ.21వేల కోట్లకు పైగా కేటాయించాం. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 30వేల పాఠశాలల్లో.. 26లక్షల విద్యార్థులు చదువుకుంటున్నారు..10వేల ప్రైవేట్ పాఠశాలల్లో.. 33 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో మీకంటే గొప్ప టీచర్లున్నారా? మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఇందుకు కారణం కావచ్చు. తెలంగాణలో ఉద్యోగుల పరిస్థితి ఉమ్మడి రాష్ట్రంలో కంటే దారుణంగా ఉంది.. ఇది కఠోర నిజం. టీచర్లు తేనెతుట్టె లాంటి వాళ్లు.. హాని చేయాలని చూస్తే తీనెటీగల్లా ఎదురుదాడికి దిగుతారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు నమ్మకం కలిగించేందుకు ప్రతీ నెలా 1వ తేదీనే జీతాలు అందించేలా చర్యలు తీసుకున్నాం. పదిహేనేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల ప్రమోషన్ల అంశాన్ని పరిష్కరించాం. మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పడానికే ఈ సమావేశం ఏర్పాటు చేశాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ భవిష్యత్ మా చేతుల్లో కాదు..మీ చేతుల్లో ఉందని చెప్పేందుకే ఈ సమావేశం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నేను ఈ స్థాయికి చేరా. అలాంటి ప్రభుత్వ టీచర్లను కలుసుకునేందుకే ఈ ఆత్మీయ సమావేశం. టీచర్లంతా 90శాతం పైగా నిబద్ధతతో పనిచేయాలి.. విద్యార్థులకు విద్యనందించాలి. గత ఏడాదికంటే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 2లక్షలకు పైగా విద్యార్థుల అడ్మిషన్లు తగ్గాయి. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడం ఆత్మగౌరవమని భావించేలా పాఠశాలలను తీర్చిదిద్దాలని అన్నారు. ప్రభుత్వం వైపు నుంచి మీ సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు స్వయం సహాయక మహిళా సంఘాలకు బాధ్యత అప్పగించాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో మహిళలకు బాధ్యత అప్పగించాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించాం. తెలంగాణ బలపడాలి అంటే మనందరం కార్యదీక్షతో పనిచేయాలని అన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టనుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాల్లో మినీ స్టేడియంల ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. నైపుణ్యం లేకపోవడం వల్లే నిరుద్యోగం పెరుగుతోంది. అందుకే ముచ్చర్లలో 50 ఎకరాల్లో రూ.150 కోట్లతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసుకున్నాం. స్కిల్ యూనివర్సిటీలో యువకులకు నైపుణ్యంతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. క్రీడలను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ పాలసీని తీసుకొస్తాం. మీరు నేర్పే విద్యనే రేపటి తెలంగాణ భవిష్యత్‌కు బాటలు వేస్తుంది. పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే మీ లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరామ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ కేంద్రాలలో ప్రారంభమైన తల్లి పాల వారోత్సవాలు

జగిత్యాల ఆగస్ట్ 02 (ప్రజామంటలు):
రూరల్ బాలపల్లి గ్రామంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు. అంగన్వాడి కేంద్రాల్లో తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, కిశోరబాలురు పాల్గొన్నారు. దీనిలో భాగంగా జగిత్యాల రూరల్ మండల్ బాలపల్లిలోని అంగన్వాడీ కేంద్రంలో తల్లి పాల విశిష్టత మరియు పోషకాహారం గురించి బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నారు. తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలంటే పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్, గణేష్, ఎ.ఎన్.యం. ఆశ, అంగన్వాడి టీచర్లు, పిల్లల తల్లులు, పిల్లలు, కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందకుంట గ్రామ దేవాలయానికి రక్షణ కరువాయే




ఇల్లందకుంట ఆగస్ట్ 02 (ప్రజామంటలు):
శ్రీ సితా రామ చంద్ర స్వామి వారి పురాతన ఆలయం
అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లంతకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు పెద్ద దేవాలయంలో బ్రహ్మాండంగా ఉత్సవాలు జరుగుతున్నాయి. సంవత్సరంలో ఎక్కువ కాలం పాటు స్వామివారు గ్రామ దేవాలయం నందు ఎప్పటికీ అక్కడే ఉత్సవాల్లో భాగంగా భక్తులకు స్వామి వారు దర్శనమిస్తుంటారు. అటువంటి దేవస్థానంలో కనీస సౌకర్యాలు లేకుండా గుడికి సున్నం లేకుండా అపరిశుభ్రంగా శిథిలావస్థకు చేరింది. ఇంకా పెద్ద దర్వాజా ఎన్నో రోజుల నుండి దర్వాజ మరమత్తుల పేరా తలుపులు తీసి పక్కకు పెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తలుపులు లేకుండా గ్రామ దేవాలయానికి రక్షణ కరువై అభద్రత యుక్తంగా ఉన్నది. గతంలో కొన్ని సంవత్సరాల క్రితం శ్రీ సితారామ చంద్ర స్వామి వారి ఉత్సవా మూర్తులు దోంగిలించే ప్రయాత్నం చేశారు. ఇప్పటికైనా గ్రామంలోని ఆలాయ ప్రధాన ద్వారానికి తలుపులు అమర్చే విధంగా ఆలయ ఈవో గారికి గ్రామ ప్రజలు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఇల్లందకుంట మండల అధ్యక్షులు మొత్కూరి శ్రీనివాస్ గౌడ్, మున్నూరు కాపు ఇల్లందకుంట మండల అధ్యక్షులు అప్పాల రమేష్, కునం రమేష్, మొటపోతుల దేవేందర్, గాండ్ల రవీందర్, అప్పాల రాజేందర్, అలాగే ఆలయ ఈవో కు గ్రామ ప్రజలు విన్నవించుకోవడం జరిగింది.

# జాబ్ క్యాలెండర్ వచ్చేసింది...

వరుసగా పోస్టుల భర్తీని పూర్తి చేశాం. పాత నోటిఫికేషన్లను రద్దు చేసి కొత్త నోటిఫికేషన్లు విడుదల చేసి, ఎగ్జామ్స్ సజావుగా నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తున్నామని' భట్టి విక్రమార్క పేర్కొన్నారు.ఇకపోతే షెడ్యూల్ ప్రకారం..వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ ఆఫీసర్ నియామకాల కోసం సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల... నవంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. ట్రాన్స్‌కోలోని వివిధ ఇంజినీరింగ్ ఉద్యోగాల కోసం అక్టోబర్‌లో నోటిఫికేషన్.. వచ్చే ఏడాది జనవరిలో నియామక పరీక్షలు చేపడతారు. నవంబర్‌లో టెట్ నోటిఫికేషన్ విడుదల చేసి వచ్చే ఏడాది జనవరిలో పరీక్షలు నిర్వహిస్తారు. వివిధ శాఖల్లో గెజిటెడ్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది జనవరిలో నోటిఫికేషన్ విడుదల.. ఏప్రిల్‌లో పరీక్షలు చేపడతారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల .. ఏప్రిల్‌లో పరీక్షలు జరుగుతాయి. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ .. మేలో పరీక్షలు చేపడతారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష వచ్చే ఏడాది జులైలో నిర్వహించ నున్నారు. ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో నోటిఫికేషన్ విడుదల చేసి ఆగస్టులో పరీక్షలు నిర్వహిస్తారు. డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టులకు వచ్చే ఏడాది జూన్‌లో నోటిఫికేషన్..సెప్టెంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది మేలో మరోసారి గ్రూపు2 నోటిఫికేషన్.. అక్టోబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది జులైలో గ్రూప్-3 నోటిఫికేషన్ నవంబర్‌లో పరీక్షలు జరుపుతారు. సింగరేణిలో పలు ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది జులైలో నోటిఫికేషన్.. నవంబర్‌లో పరీక్షలు చేపడతామని ప్రకటనలో వివరించారు.

మహమ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగాలు: డిప్యూటీ సీఎం భట్టి
తెలంగాణకు పేరు తెచ్చిన క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. టీమ్ ఇండియా క్రికెటర్ మహమ్మద్ సిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగాలు ఇస్తున్నట్లు చెప్పారు.ఈ మేరకు శాసనసభలో ఆయన ప్రకటన చేశారు. అనంతరం క్రీడా రంగానికి సంబంధించిన పలు సవరణ బిల్లులను సభలో భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. వీటికి మద్దతు తెలపాలని ప్రతిపక్షాలను ఆయన కోరారు.మరోవైపు సివిల్ కోర్టుల సవరణ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపింది. సభ ప్రారంభం కాగానే మంత్రి శ్రీధర్‌బాబు బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా భారాస, సీపీఐ, భాజపా, ఎంఐఎం సభ్యులు మాట్లాడారు. ఆ తర్వాత బిల్లు సభ ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. తొలుత భారాస ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడుతూ బిల్లుకు తమ పార్టీ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి లబ్ధి కలిగించే విషయాల్లో అందరం కలిసి పనిచేద్దామన్నారు. అత్యాచారాలు, సైబర్‌క్రైమ్‌పై ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని కోరారు. బాధితులకు త్వరగా న్యాయం జరుగుతుందనే భరోసా ఇవ్వాలన్నారు. ఆ తర్వాత సీపీఐ, భాజపా సభ్యులు మాట్లాడారు.సివిల్ కోర్టుల సవరణ బిల్లుకు ఆమోదం తెలియజేస్తున్నట్లు సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు తెలిపారు. దేశవ్యాప్తంగా న్యాయ వ్యవస్థ కొట్టుమిట్టాడుతోందని.. ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అన్ని అంశాలను పరిష్కరించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ధర్నా చేసేందుకు అనుమతి అడిగితే పోలీసులు నిరాకరిస్తున్నారని చెప్పారు. పోలీస్ శాఖ అత్యుత్సాహం ప్రదర్శిస్తోందని వ్యాఖ్యానించారు. ఉపా వంటి చట్టాలను కేంద్రం యథేచ్ఛగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ చట్టాలను అమలు చేయకుండా నిలువరించాలన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన కొత్త న్యాయ చట్టాలు ఇబ్బందికరంగా ఉన్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాలను సవరించే అంశంపై పరిశీలించాలని కూనంనేని సాంబశివరావు కోరారు.సివిల్ కోర్టు సవరణ బిల్లును సమర్థిస్తూ భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కొన్ని సూచనలు చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల సంఖ్య పెంచాలన్నారు. కొత్తగా ఏర్పడిన జిల్లాలో కోర్టులకు సొంత భవనాలు లేవని సభ దృష్టికి తీసుకువచ్చారు. అద్దె భవనాల్లో కోర్టులు నిర్వహించడం బాధాకరమన్నారు. నియోజకవర్గాల్లో జూనియర్ సివిల్ కోర్టులు లేవని.. కేసుల సత్వర పరిష్కారానికి వాటి సంఖ్యను పెంచాలని కోరారు.

## హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం - సీఎం రేవంత్‌రెడ్డి



కార్యకలాపాలు పెరిగాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ క్రికెటర్ మహమ్మద్ సిరాజ్‌కు గ్రూప్-1 ఉద్యోగం ఇస్తున్నామన్నారు. బాక్సర్ నిఖత్ జరీన్‌కు ఆర్థికసాయం చేశామని.. ఇంటిస్థలం కూడా కేటాయించామని తెలిపారు. వ్యసనాల నుంచి యువతను బయటకు తీసుకురావాలంటే క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉందన్నారు. వచ్చే సమావేశాల్లో క్రీడలకు సంబంధించిన పాలసీ తీసుకొస్తామని.. దీనికి సంబంధించి ప్రతిపక్షాలు సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామని తెలిపారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తిని పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దీనికి అందరూ సహకరించాలని సీఎం కోరారు.

## ముర్రు పాల తో పిల్లలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది:సిడిపిఓ వాణిశ్రీ



జగిత్యాల సారంగాపూర్ ఆగస్ట్ 02 (ప్రజామంటలు):
బిడ్డ పుట్టిన వెంటనే ఉర్రుప్రోలు తాగిస్తే పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ధర్మపురి సిడిపిఓ వాణిశ్రీ అన్నారు. శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సారంగాపూర్ మండల కేంద్రంలో, సిడిపిఓ శ్రీమతి బి వాణిశ్రీ అధ్యక్షతన సారంగాపూర్ గ్రామపంచాయతీలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ వాణిశ్రీ మాట్లాడుతూ గంటలోపే ముర్రుపాలు పట్టించాలని, తల్లిపాలు ప్రాముఖ్యతను వాటి వలన కలిగే లాభాలను గురించి వివరించారు.అనంతరం మెడికల్ ఆఫీసర్ శివకుమారి మాట్లాడుతూ... ముర్రుపాలు వాటి విషిష్టత, తల్లిపాల అవశ్యకతను గురించి తల్లిపాలు పట్టించకపోతే గలిగే నష్టాల గురించి తల్లులకు వివరించారు. సఖి అడ్మిన్ మనీలా సఖీ ద్వారా అందించే సేవలు, మహిళ హెల్ప్ లైన్ 181 గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు లత, శైలజ, పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడీ టీచర్లు, గర్భిణీలు తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛదనం-పచ్చదనంపై అవగాహన కార్యక్రమము..

భీమదేవరపల్లి ఆగస్టు02 (ప్రజామంటలు)
ప్రభుత్వం ఈనెల ఐదు నుంచి ఐదు రోజులపాటు నిర్వహించతల పెట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని సమర్ధ వంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిఆర్డిఏ శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం భీమదేవరపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం స్పెషల్ ఆఫీసర్లు పంచాయతీ కార్యదర్శులు ఈజీఎస్ భరతమాత సమాఖ్య సిబ్బందితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేలా అందరు.సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈనెల 5న గ్రామాల్లో ప్రారంభించాలన్నారు.6న తాగునీటి సరఫరా,ఇంకుడు గుంతల నిర్మాణం,7న మురుగు కాలువలు నీటి నిలువ ప్రాంతాలను శుభ్రంచేసి గుంతలనుపూడ్చడం,8న సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన, వీధి కుక్కల దాడుల నివారణచేపట్టడం,9న డ్రైడే,ప్రభుత్వ కార్యాలయాల శుభ్రం






చేయడంవంటి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీరేశం ఎంపీవో నాగరాజు ఏపీవో కుమారస్వామి స్పెషల్ ఆఫీసర్లు పంచాయతీ కార్యదర్శులు ఈజీఎస్ సిబ్బంది భరతమాత సమాఖ్య సిఏలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## వ్యాసకర్తలకు వినతి

రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి. పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.

mantalukathalu@gmail.com

-ఎడిటర్

## కలామ్ కు సలామ్

అబ్దుల్ కలామ్ కు సలామ్
కలలు కనుమన్నాడు
కంటూనే ఉన్నాను
కష్టం లేకుండా!

సాకారం చేసుకోమన్నాడు
కావడం లేదు
కష్టం లేకుండా సాధించగలమా ఇష్టమయినది!

అల్లావుద్దీన్ లేడు
అద్భుత దీపం ఇవ్వడానికి!

జగ్గయ్య.జి
9849525802

# తండ్రికి తగ్గ తనయుడు సూరి బాలకృష్ణ

## ఆగష్టు 3... సూరి బాలకృష్ణ జయంతి



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



భారత దేశం గర్వించదగిన శాస్త్ర వేత్తలలో సూరి భగవంతం అగ్రభాగాన నిలిచే వారిలో ఒకరు. భారత దేశ రక్షణ శాఖ సలహాదారుగా, దేశ తొలి ప్రధాని నెహ్రూకు శాస్త్రీయ అంతరంగిక సలహాదారుగా పని చేసిన తెలుగు తేజం సూరి భగవంతం భారతరత్న, నోబెల్ పురస్కార గ్రహీత సి.వి. రామన్ శిష్యులు. సత్యసాయి బాబావారికి ఆంతరంగిక శిష్యులు. కేంద్ర ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ సైంటిఫిక్ అడ్వైజర్ ఉస్మానియా యూని వర్సిటీలో ఫిజిక్స్ ప్రొఫెసర్, లాబ్ డైరెక్టర్, వైస్ చాన్సలర్ డిఫెన్స్ రి సెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ కు డైరెక్టర్ జనరల్ గా ఆయన విశేష సేవలు అందించి గుర్తింపు పొందారు. భూతలం మీద, సముద్ర జలాలమీద, గాలిలో దేశ పోరాట శక్తులను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బలోపేతం. చేయటానికి డి.ఆర్.డి.ఓను ఒక సమర్ధ వంతమైన పనిముట్టుగా రూపొందించిన అసమాన ప్రజ్ఞాశాలి భగవంతం.

ఆయన కుమారుడే సూరి బాలకృష్ణ తండ్రికి తగ్గ తనయునిగా గుర్తింపు పొందారు. సూరి బాలకృష్ణ భూ భౌతిక విజ్ఞాన శాస్త్రవేత్త. అసమాన పరిశోధకులు. సూరి బాలకృష్ణ 1941 ఆగస్టు 3న గుంటూరులో జన్మించారు. 1952 నుంచి భూ విజ్ఞాన, భూ. భౌతిక శాస్త్రాలలో విశేష పరిశోధనలు జరిపారు. శిలల భౌతిక ధర్మాలు, వాటి భూ విజ్ఞాన లక్షణాలు, భూ జలాన్వేషణ మొదలైన అంశాల మీద పలు పరిశోధనలు నిర్వహించారు. 1953 లో, ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి ఎం ఎస్ సి సాధించారు. ఉద్యోగిగా తొలుత ఉస్మానియా యూనివర్సిటీలో రీసెర్చి స్కాలర్ గా (1953-54) చేరారు. న్యు ఢిల్లీ లోని నేషనల్ ఇన్ స్టి ట్యూట్ ఆఫ్ సైన్సెస్ లో రిసెర్చ్ ఫెలో గా 1954లో చేరారు. 1955లో ఉస్మానియా యూనివర్సిటీ నుండి పి హెచ్ డి. అందుకున్నారు. బాలకృష్ణ 1956-57 కాలంలో హార్వర్డ్ : యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయల్ రిసెర్చ్ ఫెలోగా గుర్తింపు పొందారు. జపాన్ ప్రభుత్వ గౌరవ పురస్కారం తో పాటు, జపాన్ జియోలాజికల్ సొసైటీ ఫెలోషిప్ నూ అందు కున్నారు.. ఉస్మానియా యూనివర్సిటీ జియాలజీ విభాగానికి అధిపతిగా (1961-64) రాణించారు.

మధ్య కాలంలో ఇదే విభాగానికి రీడర్ గా (1957-61), శాఖాధిపతిగా (1962) గౌరవ ప్రొఫెసర్గా (1964), అసిస్టెంట్ డైరెక్టర్ గా (1965) వివిధ పదవులను సమర్థ వంతంగా నిర్వహించారు. ప్రతి శాఖలోనూ తన ప్రతిభను చాటారు. హైదరాబాద్ లోని నేషనల్ జియో ఫిజికల్ రిసెర్చ్ ఇన్ స్టిట్యూట్కు అసిస్టెంట్ డైరెక్టర్ గా యాక్టింగ్ డైరెక్టర్ గా 1979 నుంచి 81 వరకు సేవలందిం చారు. ఇండియన్ జియో ఫిజికల్యూనియాన్ కు కార్యదర్శిగా ఉంటూ -ఫెలోషిప్ అందుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోషిప్ కూడా పొందారు. జియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియాకు ఫౌండర్ ఫెలోగా, ఇండియన్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ అధ్యక్షునిగా కూడా పని చేశారు.

పర్వతాలు, శిలల స్థితి స్థాపకత్వం భూ సంబంధ లక్షణాలున్న వాటి అనుబంధాల పైనా పరిశోధించి సాధికారిక పత్రాలు రాశారు. అనేక దేశాలు పర్యటించి ఉపన్యా సాలిచ్చి, అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని విలువైన 125 ప్రామాణిక పరిశోధనా పత్రాలు సమర్పించారు. భూ ప్రకంపనాలు, భూ కంపాలు, భూ అయస్కాంత క్షేత్రాలు, గురుత్వాకర్షణ క్షేత్రాలు, వాటి పని తీరులపై సునిశిత పరిశోధన చేసిన పరిశోధనా శ్రేష్ఠులు ఆయన. సూరి బాలకృష్ణ 1984 సెప్టెంబరు 9 న హైదరాబాదులో గుండెపోటుతో మరణించారు. ఆ పరిపాలనా దక్షత, కార్యకలాపాల సమన్వయ నైపుణ్యం. నాయకత్వ పటిమలతో భూవిజ్ఞాన శాస్త్ర రంగాలలో సాటిలేని మేటి శాస్త్రవేత్తగా రాణించారు. బాలకృష్ణ శాస్త్రీయ కృషిఫలితంగా 1967లో కృష్ణన్ గోల్డ్ మెడల్, 1979 లో ఆంధ్ర ప్రదేశ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వారి అవార్డుల గ్రహీతగా నిలిచార 1967 లో కృష్ణన్ గోల్డ్ మెడల్ 1979 లో ఆంధ్రప్రదేశ్ అకాడెమి ఆఫ్ సైన్సెస్ అవార్డ్ పొందారు. భూ విన శాస్త్రంలో సాటిలేని విజ్ఞాన ఖనిగా, పాలనా దక్షునిగా, క్రమ శిక్షణగల నాయకునిగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన మేధావి. సైంటిస్ట్ సూరి రామకృష్ణ తండ్రి భగవంతంకు తగ్గ తనయుడు అనిపించు కున్నారు.

# ధరణి పేరుతో దగా

వచ్చిన తర్వాత న్యాయం జరుగుతుందని ప్రజలు విశ్వాసంలో ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వం ధరణినీ ఐఎల్ ఎఫ్ కంపనీకి అప్పగించారని మండిపడ్డారు. కంపనీ కొన్ని కారణాలతో.. సింగపూర్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగపూర్ కంపనీకి కేసీఆర్ తెలంగాణ భూములు తాకట్టు పెట్టారు అని మండిపడ్డారు. డిఫాల్ట్ కంపనీ కి ధరణి పోర్టల్ అప్పగించారని అన్నారు. బీఆర్ఎస్ చేసిన నిర్వాకం రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ఇద్దరు వ్యక్తులు కూర్చొని చేసిన చట్టం ధరణి అన్నారు. ఆల్ ఇన్ వన్ గా చెప్పుకున్న పెద్దాయన చేసిన నిర్వాకం ఇది అని తెలిపారు. ధరణి పేరుతో దగా చేశారన్నది నిజం అని అన్నారు. పదేళ్ల తెలంగాణ రాష్ట్రం.. ధృతరాష్ట్ర కౌగిలో ఇరుక్కుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. కొండ నాలుక కి మందు వేస్తే ఉన్న నాలిక పోయినట్టుగా ధరణి ఉందని అన్నారు. 1973లో కాంగ్రెస్ ప్రభుత్వం సీలింగ్ చట్టం తీసుకొచ్చి పేదలకు భూములు పంపిణీ చేసిందన్నారు. వైఎస్ హయాంలో బీడు భూములకు పట్టాలు ఇచ్చారన్నారు. ప్రజలకు మేలు చేసిన వారి పేర్లను ప్రస్తావించడం తగదన్నారు. భూసంస్కరణలతో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తామని చాలా మంది చెప్పారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ లోపభూయిష్టంగా ఉంది. ప్రధానమంత్రి ఇందిరాగాంధీ భూసంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అనేక అంశాలు భూ సంస్కరణలతో ముడిపడి ఉన్నాయి.

పీవీ ప్రధానిగా ఉన్నప్పుడు కూడా భూసంస్కరణలు చేపట్టారన్నారు. ప్రపంచ చరిత్రలో నిలిచిన భూదాన ఉద్యమం ఇక్కడే పుట్టిందన్నారు. ధరణీ చట్టం మూడు తలలతో మొదలై.. 33 తలలతో అవతరించిందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు భట్టి విక్రమార్క ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర చేసిన సమయంలో ఎక్కడికి వెళ్లినా ధరణీ సమస్యల గురించే ప్రజలు ఆయనకు వివరించారన్నారు. ధరణీని బంగాళఖాతంలో వేస్తామని రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో చెప్పారని గుర్తు చేసారు. ధరణీతో సామాన్యులు అవస్థలు పడ్డారని పొంగులేటి తెలిపారు. ధరణీ వచ్చిన తరువాత ప్రతీ గ్రామంలో సమస్యలే ఉన్నాయన్నారు. అప్పటి సర్కార్ పెద్దలు ధరణీ పేరుతో ప్రజలకు దగా చేశారన్నది ముమ్మాటికి నిజమన్నారు. ధరణీ సమస్యలతో రైతులు రోడ్డున పడ్డారు. చెప్పులు అరిగేలా ఆఫీసుల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కాలేదని గుర్తు చేసారు. సాదా బైనామాలకు నోటిఫికేషన్ ఇచ్చి ధరణీలో ఆ కాలమే పెట్టలేదని మండిపడ్డారు. 18 లక్షల ఎకరాల భూమిని పక్కకు పెట్టారని అలా ఎందుకు చేయాల్సి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. అధికారంలో రాగానే ధరణి సమస్యలపై అధ్యయనం కోసం కమిటీనీ ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ఇటీవల కొన్ని సిఫారసులు చేసింది. ఆ సిఫారసుల మేరకు.. ధరణి పోర్టల్ భూమాతగా మార్చి.. సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమయంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ... భూ రికార్డుల కోసం తీసుకువచ్చిన ధరణి సాఫ్ట్ వేర్ తో అసైన్డ్ భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం గుంజుకుందని ఆరోపించారు. ధరణిలో జరిగిన తప్పుల కారణంగా అధికారులపై దాడులు జరిగాయన్నారు. రైతులు ధరణి అంటేనే భయపడుతున్నారని ఆమె అన్నారు. గ్రామాల్లోకి వెళ్తే ధరణి ఎప్పుడు మార్చుతారని రైతులు అడుగుతున్నారని సీతక్క చెప్పారు. ధరణితో మళ్లీ కొందరి చేతుల్లోకే భూమి వెళ్తోందన్నారు. ధరణి పేరుతో పేద రైతుల భూములు గుంజుకొని, వారికి అన్యాయం చేశారని మంత్రి సీతక్క అన్నారు. ల్యాండ్ సీలింగ్ యాక్ట్కు తూట్లు పొడుస్తున్నారని ఆమె అన్నారు. ధరణి ధరణిని రద్దు చేసి, దానిలోని మంచి విషయాలు ఉంటే స్వీకరిస్తామని అన్నారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. ధరణి పోర్టల్ తో బీఆర్ఎస్ నేతలు వేల కోట్ల ఎకరాలు కబ్జా చేశారని వార్తలు వచ్చాయన్నారు. ఆ నేతలు ఎవరు? కాజేసిన భూమి ఎది? అనేది కాంగ్రెస్ బహిర్గతం చేయడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. మరి కాకి లెక్కలు చెప్తున్నారని ఆయన మండిపడ్డారు. భూములు ఎవరు కాజేశారనేది వెల్లడించాలని మహేశ్వర్ రెడ్డి కోరారు. ఇప్పటి వరకు ఎన్ని ఎకరాలు రికవరీ చేశారని ఆయన అన్నారు. గతంలో ఇది 2 లక్షల కోట్ల కుంభకోణం అంటూ ఆరోపణలు చేసారని మహేశ్వర్ రెడ్డి వెల్లడించారు. ఈ పోర్టల్ ను గత ప్రభుత్వం విదేశీ కంపెనీకి అప్పగిస్తే.. ఈ ప్రభుత్వం ఎందుకు విచారణ చేయడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఫారెస్ట్ భూములు, ప్రభుత్వ భూములు తగ్గాయని అంటున్నారని, బీఆర్ఎస్ భూభకాసురులు కాజేశారా? ధరణి పోర్టల్ నిర్వహణను ఎవరికి ఇచ్చే ఆలోచన ఉంది..ధరణి పోర్టల్ పై ఫోరెన్సిక్ ఆడిట్ జరిపిస్తారా ? జరిపిస్తే ఎప్పటిలోగా జరిపిస్తారు? అని మహేశ్వర్ రెడ్డి ప్రశ్నలు సంధించారు. హైదరాబాద్ లో వక్ఫ్ బోర్డ్ భూములు వేల ఎకరాలు కబ్జాకు గురైందని అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. చర్చలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ధరణి పోర్టల్ పేరును నాలుగు గోడల మధ్య పెట్టలేదని.. అనేక రివ్యూలు చేసి అందరి సమక్షంలో నిర్ణయించిన పేరే ధరణి అని తెలిపారు. రెవెన్యూ చట్టాలను మార్చేందుకు నిర్వహించిన పలు సమావేశాల్లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాటి సీఎం కేసీఆర్తో ఉన్నారు. దురదృష్టం ఏంటంటే ప్రభుత్వంలో ఇప్పుడు ఆయనకు మంత్రిగా అవకాశం వచ్చింది.

మిగతా మంత్రులు తిట్టినట్టే పొంగులేటి కూడా కొన్ని అనరాని మాటలు అన్నారు. కేసీఆర్ పట్ల అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. వారి విజ్ఞతకే వదిలేస్తున్నాను. ఎందుకంటే అవకాశం వచ్చినప్పుడు ఒదిగి ఉంటే మంచిది. కేసీఆర్ పట్ల అభ్యంతరకర వ్యాఖ్యలను ఖండిస్తున్నానని పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ధరణి పేరు బాగాలేదని భూమత అని పెట్టుకుంటున్నారు. 2017లో ఎల్ఆర్యూపీ(ల్యాండ్ రికార్డ్స్ అప్డేషన్ ప్రోగ్రామ్స్) తీసుకున్నాం. 584 మండలాల్లో 10828 గ్రామాల్లో 15700 బృందాలు భూరికార్డులను పరిశీలించాయి. ఇందుకోసం 10809 రెవెన్యూ ఉద్యోగులు 24 వేల వీఆర్ఏలు, 535 సర్వేయర్లు కలిసి గ్రామాల్లో రికార్డులు పరిశీలించి సమాచారం తీసుకున్న తర్వాతనే పార్ట్-ఏ, పార్ట్-బీ అని పెట్టారు. పార్ట్-ఏలో వివాదాల్లేని 90 శాతం భూములు రికార్డు అయ్యాయి. 2017లో 100 రోజుల్లో ఈ పని చేశారు. వారికి బోనస్గా వేతనం ఇవ్వడం జరిగింది. ఇలాంటి చారిత్రక నిర్ణయం ఏ ముఖ్యమంత్రి కూడా తీసుకోలేదని పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. 60 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉందని సర్వేలో తేలింది. దాంట్లో 142 లక్షల ఎకరాలు పార్ట్ ఏలో నిక్షిప్తమైంది. 18 లక్షల ఎరాల భూమి రకరకాల కారణాల చేత పార్ట్-బీలో పెట్టారు. పార్ట్-బీలో మూడు రకాల సమస్యలు వచ్చాయి. అన్నదమ్ముళ్ల మధ్య పంచాయతీ, గెట్టు పంచాయితీ, కోర్టు కేసులు ఉండొచ్చు. రెండోది రెవెన్యూ సమస్యల వల్ల, మూడోది ఐటీ పోర్టల్లో కొన్ని సమస్యలు వచ్చాయి. ఈ సమస్యల కారణంగా 18 లక్షలు పార్ట్-బీలో పెట్టారు. ఆ ధరణి బాగాలేకపోతే మీరు ఎందుకు వినియోగిస్తున్నారు. పేరు మాత్రమే మార్చుతున్నారు. 82 లక్షల ఎకరాల భూమి ప్రభుత్వానికి సంబంధించి గ్రామ కంఠాలు, ఫారెస్టు, ఇతర ఇన్స్టిట్యూషన్లదిగా నిర్ధారించబడింది. ప్రభుత్వ భూమి అని నిర్ధారించబడిన భూమిని ప్రొహిబిటెడ్ ల్యాండ్లో పెట్టారు అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు.

# ప్రకృతి విధ్వంసానికి సాక్షి కేరళ !

ప్రకృతి విధ్వంసానికి పరాకాష్టగా కేరళ విలయాన్ని చూడాలి. అక్కడి కొండలు, గుట్టలను, భారీ వృక్షాలను నరుతూ పోతున్నారు. పెరుగుతున్న జనాభా కారణంగా కేరళ కూడా ఇలాంటి విధ్వంసానికి సాక్షిగా నిలిచింది. అందుకే అదే విషాదం.. దేవభూమిగా పేరున్న అందాల కేరళలో విధ్వంసం జరిగింది. విలయం సృష్టించింది. ఇప్పటికే 13 మందికి పైగా మృత్యువాత పడ్డారు. ఓ గ్రామం నేలమట్టం అయ్యింది. నిజంగా ఇదో హెచ్చరికగా చూడాలి. దేశం యావత్తూ దీనినుంచి గుణపాఠ చేర్చుకోవాలి. ఇలాంటి విధ్వంసాలకు కారణాలు తెలుసుకోవాలి. ప్రకృతిని దెబ్బతీస్తే దాని దెబ్బ ఎలా ఉంటుందో గమనించాలి. ఏటా వచ్చే రుతుపవనాలు కేవలం వర్షాలను మాత్రమే కురిపించి ఆగిపోవడం లేదు. విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయి. 2015 నుంచి 2022 మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా కొండచరియలు విరిగిపడ్డ ఘటనలు 3 వేల 782 జరిగితే అందులో కేరళలోనే అత్యధికంగా జరిగాయన్నది పార్లమెంట్ సాక్షిగా 2022లో కేంద్ర మంత్రి జితేందర్ సింగ్ వెల్లడించిన వాస్తవం. తాజాగా మరోసారి వయనాడ్లో జిల్లాలో వర్షాలు, వరదలు సృష్టించిన బీభత్సం తో కేరళ తీవ్రంగా తల్లడిల్లిపోతోంది. అందాల టీ తోటలకు, పచ్చని ప్రకృతికి పేరున్న వయనాడ్ ఇప్పుడు వరదల ధాటికి భయానకంగా మారింది. ముఖ్యంగా వయనాడ్ జిల్లాలోని మెప్పాడి, చురామల, మందక్కాయి, అట్టమల, నులుప్పుజ పరిసర ప్రాంతాల్లో విరిగిపడ్డ కొండచరియలు వందలాది కుటుంబా లలో విషాదం నింపాయి. మృతుల సంఖ్య పెరుగుతూనే వస్తోంది. భారీ వర్షాలు కూడా కురుస్తూ ఉండటం స్థానిక నదులు ఉప్పొంగుతున్నాయి. నీటిలో కొట్టుకొస్తున్న మృత దేహాల్లో తమ వారున్నారేమో అన్న భయం, ఆందోళన స్థానికుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఏటా జరుగుతున్న ఈ విధ్వంసానికి ఇప్పటికే కొన్ని కళ్లు అలవాటుం ˇడిపోయినా? తమ కళ్ల ముందే తమ రక్తసంబంధీకులు, స్నేహితులు అన్యాయంగా ప్రాణాలు కోల్పోతుంటే వారి దుఃఖాన్ని ఆపడం ఎవ్వరి తరం కావడం లేదు. నిజానికి ఈ పరిస్థితి కేరళకు కొత్తేం కాదు. జులై, ఆగస్టు నెలలు వస్తే చాలు కేరళలో భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగి పడటం కొన్నేళ్లుగా సర్వ సాధారణంగా మారుతూ వస్తోంది. కేరళకు పశ్చిమాన విస్తారమైన సముద్రతీరం ఉంటే? తూర్పున పర్వత ప్రాంతాలు ఎక్కువగా ఉంటాయి. దీంతో ప్రతి జులై నెలాఖరు, ఆగస్టు నెలల్లో విస్తారమైన వర్షాలు కురుస్తాయి. ఫలితంగా కొండల్లో ఉన్న సెలయేళ్లు, నదులు ఉధృతంగా ప్రవహిస్తూ కొన్ని సార్లు ఈ ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. 2018లో వచ్చిన వరదలు కేరళలో విధ్వంసం సృష్టించాయి. సుమారు 600 మంది ప్రాణాలు కోల్పోగా ఏకంగా 31 వేల కోట్ల రూపాయలన ఆస్తి నష్టం సంభవించింది. ఈ ప్రకృతి విపత్తు 2015-2019 మధ్య కాలంలో ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ మార్పుల కారణంగా సంభవించిన అత్యంత ఘోర విపత్తులలో ఒకటిగా ప్రపంచ వాతావరణ సంస్థ పేర్కొంది. 2019లోనూ సంభవించిన వరదల కారణంగా 121 మంది ప్రాణాలు కోల్పోగా సుమారు 2 లక్షల మంది బాధితులుగా మిగిలారు. అలాగే అదే ఏడాది కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. సుమారు 22 వేల మంది నిరాశ్రయులయ్యారు. 2020 ఆగస్టులో ఇడుక్కి, వయనాడ్, మలప్పురం, కొట్టాయం ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలు, విరిగిపడ్డ కొండచరియలు కారణంగా 66మంది ప్రాణాలు కోల్పోయారు. 2021లో 42 మంది, 2022లో 32 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. తాజాగా వయనాడ్ జిల్లాలో జరిగిన ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టం ఇంకా పూర్తి స్థాయిలో వెల్లడి కావాల్సి ఉంది. 2024 జనవరిలో కేరళ యూనివర్శిటీ ఆఫ్ ఫిషరీస్ అండ్ ఓషన్ సైన్సెస్ .. మిచిగాన్ టెక్నాలాజికల్ యూనివర్శిటీ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీలు సంయుక్తంగా చేసిన పరిశోధనలో కేరళకు సంబంధించి ప్రమాద ఘంటికలు మోగించే వాస్తవాలు వెల్లడయ్యాయి. రాష్ట్రం మొత్తం మీద 13 శాతం భూభాగంలో ల్యాండ్ స్లైడ్స్ విరుచుకుపడే ప్రమాదం ఉందని తేలింది. ప్రధానంగా ఇడుక్కి, పాలక్కడ్, మలప్పురం, పట్టణంతిట్ట, వయనాడ్ ప్రాంతాలు అత్యంత ప్రమాదకరమైన జోన్లో ఉన్నాయని ఆ పరిశోధన వెల్లడించింది. ఏఐ సాంకేతిక పరిజ్ఞానం సాయంతో రాష్ట్రంలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నప్రాంతాల మ్యాప్ను కేరళ యూనివర్శిటీ ఆఫ్ ఫిషరీస్ సిద్ధం చేసింది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిశోధన ప్రకారం కేరళలో 43 శాతం భూభాగం భూపాతానికి గురయ్యే ప్రమాదం ఉందని తేలింది. ఇడుక్కిలో 74 శాతం, వయనాడ్లో 51 శాతం భూభాగం ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉందని ఆ సంస్థ వెల్లడించింది. 2019లో కొండచరియలు విరిగిపడ్డ ఘటనలో కేరళ వ్యాప్తంగా 80 సంభవించాయి. 2018లో ఏకంగా 341 ఘటనలు జరిగాయి. వాటిల్లో కేవలం ఇరుక్కి జిల్లాలోనే 143 ఘటనలు జరిగాయి. 2015 నుంచి 2022 మధ్య కాలంలో మొత్తంగా 3782 ఘటనలు సంభవించగా అందులో కేవలం దక్షిణాదిలోనే



2239 ప్రమాదాలు జరిగాయి. మిగిలిన ప్రాంతాల్లో చూస్తే అత్యధికంగా పశ్చిమ బెంగాల్లో అత్యధికంగా 376 ఘటనలు జరిగాయి. 2018 నుంచి 2021 మధ్య కాలంలో కేవలం ఒక్క కేరళ రాష్ట్రంలోనే సుమారు600 మంది ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది నిరాశ్రయు లయ్యారు. కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలు పడటం నదులు పొంగడం మాకు అలవాటే. కానీ మంగళవారం వేకువ జామున విపరీతమైన నీటి ప్రవాహ శబ్దాలు వినిపిస్తున్నాయి. ఎప్పుడూ వినని శబ్దాలు. కేరళలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు వయనాడ్ అల్లాడిపోయింది. దీనికి తోడు కొండచరియలు విరిగిపడటంతో వందల మంది కొట్టుకుపోయారు. శిథిలాలు తవ్వి తీస్తున్న కొద్దీ శవాలు వెలుగుచూస్తూనే ఉన్నాయి.

# అవయువ దానంతో మరికొందరికి పునర్జన్మ ఇవ్వొచ్చు

## గాంధీలో జాతీయ అవయువ దాన దినోత్సవం

## రాష్ట్రం లోని డోనర్స్ ఫ్యామిలీస్ కు సన్మానం




సికింద్రాబాద్ ఆగస్ట్ 02 (ప్రజామంటలు): బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల ఆర్గాన్స్ ను డోనేట్ చేయడం ద్వారా మరికొందరికి పునర్జన్మ ఇవ్వవచ్చని జీవన్ దాన్ చైర్ పర్సన్ డీఎంఈ డాక్టర్ ఎన్.వాణీ అన్నారు. శుక్రవారం నేషనల్ ఆర్గాన్స్ డోనర్స్ డే సందర్భంగా గాంధీ మెడికల్ కాలేజీలో జీవన్ దాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అవయవాల దాతల కుటుంబాలను సత్కరించి, ప్రశంసాపత్రాలను అందచేశారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల అవయవాలను దానం చేయడానికి ముందుకు వచ్చిన వారి కుటుంబసభ్యుల సేవా భావం, సామాజిక బాధ్యతను అందరు అభినందించాల్సిందేనని ఆమె అన్నారు. జీవన్ దాన్ కో చైర్మన్, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, జీవన్ దాన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణలత, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. ఇందిర, గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ఎన్ రాజకుమారి, నెఫ్రాలజీ హెచ్ఓడీ డా.మంజూష లు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్రెయిన్ డెడ్ కారణంగా మెదడు చనిపోయిన వ్యక్తుల ఆర్గాన్స్ ను జీవన్ దాన్ లో అప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి డోనెషన్ గా ఇవ్వడం జరుగుతుందన్నారు. నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో జీవన్ దాన్ ట్రస్ట్ ద్వారా 2022 జూలై నుంచి 2023 మార్చి వరకు బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల ఆర్గాన్స్ డోనేట్ చేసిన 143 మంది దాతల ఫ్యామిలీ మెంబర్స్కు సన్మానం చేశారు. 2010 లో ప్రారంభించిన జీవన్ దాన్ ద్వారా ఇప్పటివరకు మొత్తం 1465 బ్రెయిన్ డెడ్ పేషంట్ల నుంచి సేకరించిన 2200 కిడ్నీలు, 1346 లివర్, 199 గుండెలు, 309 లంగ్స్, 14 క్లోమం, 170 గుండె నాళాలు, 1303 కళ్ళు మొత్తం 5541 ఆర్గాన్స్ ను అవసరమైన వారికి అమర్చి, వారి ప్రాణాలను నిలబెట్టామన్నారు. 2024 ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటివరకు 103 మంది బ్రెయిన్ డెడ్ దాతల నుంచి అవయవాలను సేకరించామన్నారు. ఉత్తమ సేవలందించిన రాష్ట్ర జీవన్ దాన్ ట్రస్ట్ కు నాలుగు జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయన్నారు. ఈసందర్భంగా బ్రెయిన్ డెడ్ తో చనిపోయిన తమవారిని తలుచుకొని ఆయా కుటుంబాల సభ్యులు కన్నీరు కార్చారు. తమ వారి అవయవాలు ఇంకొందరికి అమర్చి వారి ప్రాణాలను నిలబెట్టడం గొప్ప విషయమన్నారు. తమను గుర్తుంచుకొని, సన్మానించడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు.



## గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఎం కు వినతి

హైదరాబాద్ ఆగస్ట్ 02 (ప్రజామంటలు): గల్ఫ్ తదితర దేశాలలోని వలస కార్మికుల సంక్షేమం కోసం 'గల్ఫ్ బోర్డు' ఏర్పాటు చేయాలని, గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లింపుకు స్పష్టమైన జీవో జారీ చేయాలని, ఎన్నారై పాలసీ ప్రవేశపెట్టాలని, రూ.500 కోట్ల నిధులు విడుదల చేయాలని గల్ఫ్ కార్మిక సంఘాల ప్రతినిధులు శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. సీఎం సానుకూలంగా స్పందించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవతతో ఏర్పాటైన ఈ భేటీలో ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మన్ డా. బిఎం వినోద్ కుమార్, గల్ఫ్ సంఘాల ప్రతినిధులు దొనికెని క్రిష్ణ, మంద భీంరెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన లలితోపాఖ్యానం

### మాతలచే సామూహిక కుంకుమార్చన






జగిత్యాల ఆగస్ట్ 02 (ప్రజామంటలు): లలిత మాత ఆలయంలో గత ఏడు రోజులుగా తిగుళ్ల విషు శర్మ చే కొనసాగుతున్న లలితోపాఖ్యానం శుక్రవారం ముగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం మాతలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని ప్రవచనం చేసిన శర్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమం అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాద వితరణ తో పాటు మహదాశిర్వచనము అన్న ప్రసాద వితరణ జరిగింది. అమ్మవారి నామస్మరణతో ఆలయమంతా మారుమోగింది. కార్యక్రమానికి సహకరించిన దాతలకు శర్మ చేతుల మీదుగా అమ్మవారి శేష వస్త్రము ప్రసాదము అందజేశారు.



## జనగామ జిల్లాలోని గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారించాలి



జనగామ ఆగస్ట్ 02 (ప్రజామంటలు): జనగామ జిల్లాలోని గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలపై శుక్రవారం జనగామలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ కు జనగామ జిల్లా బంజారా నాయకులు వినతి పత్రం అందజేశారు. వినతిపత్రంలోని వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ మండల పరిధిలోని చంపకిల్స్ ప్రాంతం లోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో సుమారు 300 మంది విద్యార్థులకు సరిపడే తరగతి గదులు, హాస్టల్ గదులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీని ప్రక్కనే ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నెం. 140లో సుమారు 100 ఎకరాల భూమిలో 5 ఎకరాల స్థలం కేటాయించి తరగతి గదులు, హాస్టల్ గదులు నిర్మించాలని కోరారు. జనగామ జిల్లా కేంద్రంగా మైదాన ప్రాంతా ఐటిడిఎ, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం, బంజారా భవన్, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, స్టేషన్ ఘణపూర్ మండలంలో గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల పాలకుర్తి మండల కేంద్రంలో గిరిజన బాలికల, బాలుర ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయాలి. ఎర్రగొల్లపహాడ్ గ్రామంలోని సర్వేనెం 155లో గిరిజనులకు 1998లో ఇచ్చిన ఇండ్ల స్థలాల పట్టా భూమిపై రెవెన్యూ అధికారులు పెట్టిన కోర్టు కేసును తక్షణమే విరమించుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తండా, గూడెంల డెవలప్ మెంట్ బోర్డు ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలి. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పకడ్బందీగా అమలు చేయాలి. గిరిజనులకు ఉచిత న్యాయ సలహా ఏర్పాటు చేసి, న్యాయ మూర్తులను కేటాయించాలి. అసైండ్ భూములను గిరిజనులు నుండి ప్రభుత్వాలు దౌర్జన్యంగా తీసుకోవడం మానుకోవాలి. గోర్ బౌలి భాషను గుర్తించి రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్ లో చేర్చాలి. అత్యధికంగా గిరిజనులు ఉన్న పాలకుర్తి నియోజక వర్గంలో 'నియోజకవర్గాల డీలిమిటేషన్' సందర్భంగా ఎస్టీ రిజర్వ్డ్ నియోజకవర్గంగా నిర్ణయించాలి. జనగామ జిల్లా పరిధిలో ఉన్న పై సమస్యలన్నింటిని త్వరితగతిన పరిష్కరిస్తారని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం బంజారా సేవా సంఘం ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు మూడ్ లక్ష్మణ్ నాయక్, గుగులోతు లచ్చయ్య నాయక్ రెండో వార్డ్ కౌన్సిలర్ అనిత, అజ్మీర స్వామి నాయక్, లకావత్ నరేష్ నాయక్, భూక్య చందు నాయక్, ధర్మ బిక్షం, అజ్మీర సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో మృతి చెందిన గోమాత

### అంత్యక్రియలు చేసిన విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ నాయకులు



జగిత్యాల ఆగస్ట్ 02 (ప్రజామంటలు): జిల్లా కేంద్రాల్లో ప్రమాదంలో గురువారం మృతి చెందిన గోమాతకు అంత్యక్రియలు చేసిన విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ నాయకులు. ఈ సందర్భంగా విశ్వ హిందు పరిషత్ జిల్లా సహ కార్యదర్శి గాజోజు సంతోష్ మాట్లాడుతూ.... గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం బాలాజీ థియేటర్ దగ్గర గోమాతను ఢీ కొట్టడంతో గోమాత అక్కడికక్కడే మరణించిందిదని. ఈరోజు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి వెటర్నరీ హాస్పిటల్ లో పోస్టుమార్టం చేసిన తర్వాత హిందూ సాంప్రదాయ ప్రకారం విశ్వ హిందూ పరిషత్, బజరంగదళ్ నాయకులు, కార్యకర్తలు కలిసి గోమాతకు అంతక్రియలు చేశారు. ఈసందర్భంగా పోలీస్ సిబ్బంది, మరియు మున్సిపల్ సిబ్బంది సహకరించినందుకుగాను వారికి కృతజ్ఞతలు తెలిపారు. గోమాతలు పెంచే యజమానులకు కూడా దయచేసి గోమాతలను రోడ్ల పైన వదిలిపెట్టకుండా వారే రక్షణ తీసుకోవాల్సిందిగా, రోడ్లపై తిరగకుండా చూసుకోవాలని గోవుల యజమాలను విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జగిత్యాల జిల్లా కోశాధికారి మామిడాల రాములు, బజరంగదళ్ నగర సంయోజక్ పాదం మహేందర్ సాహ్ సంయోజాక్ విశ్వనాథ్ గోసంరక్షక్ దుర్గం కృష్ణ, విష్ణు దత్తాత్రేయ, విగ్నేష్, గౌతమ్, పవన్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆఫ్ జగిత్యాల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు

జగిత్యాల ఆగస్ట్ 02 (ప్రజామంటలు): స్థానిక పార్థ ప్రసూతి మరియు పిల్లల హాస్పిటల్ నందు "తల్లిపాల వారోత్సవాలు" కార్యక్రమంలో భాగంగా హాస్పిటల్ లో ఉన్న బాలింతలకు పేషెంట్లకు పండ్ల మరియు బ్రేడ్ పంపిణి చేయడం జరిగింది. తల్లిపాలయొక్క విశిష్టత గురించి యొక్క జగిత్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తాటిపాముల వినోద్ కుమార్ మాట్లాడుతూ ....ముర్రుపాలు బిడ్డ పుట్టిన గంటలోపే అందించడం ద్వారా 22శాతం నవజాత శిశు మరణాలు నివారించవచ్చుననుచూ మొదటి ఆరు నెలల వయసు వరకు తల్లిపాలుమాత్రమే ఇప్పించడం వలన పిల్లల మరణాలకు ముఖ్య కారణమైన నీళ్ల విరోచనాలు శ్వాసకోశ వ్యాధులనుంచి రక్షణ కలుగునని పాపకు రెండు సంవత్సరాల వయసు వరకు తల్లిపాలు మాత్రమే సాగించడం వల్ల పౌష్టిక ఆరోగ్యంతో పాటు ఉబకాయం నివారించవచ్చునని తల్లిపాలతో పెరిగిన పిల్లల్లో అధిక మేదో సంపత్తి పరిపూర్ణ ఆరోగ్యం మెదడులో చురుకుదనం కలుగుతాయని తెలిపారు. అలాగే తల్లులు ఏలాంటి ఆపోహాలకు పోకుండా చనుబాలు పిల్లలకు అందించడం ద్వారా అనేక జబ్బులు, మానసిక రుగ్మతలు రాకుండా కాపాడినవారవుతారని లయన్ డాక్టర్ అంకం అరుణ లక్ష్మణ్ తెలిపారు. లయన్స్ క్లబ్ జిఎంటి కోఆర్డినేటర్ లయన్ డాక్టర్ లయన్ కె. చంద్రమోహన్ రీజియన్ చైర్ పర్సన్ టి. రాజేందర్ గారు. జోనల్ చైర్పర్సన్ లయన్ బాపురెడ్డి గారు లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి లయన్ వడ్డగడ్డ శంకర్ చార్టర్ ప్రెసిడెంట్ లయన్ శ్రీరాముల సుదర్శన్, లయన్ కోశాధికారి లయన్ గుండేటి గంగాధర్, సభ్యులు లయన్ దోపటి దేవదాస్, లయన్ వడ్లగట్ట గోపి మరియు ఇతర లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులను విస్మరిస్తే శిక్షార్హులే



జగిత్యాల ఆగస్ట్ 02 (ప్రజామంటలు): తల్లిదండ్రులను విస్మరించేవారు శిక్షార్హులేనని జగిత్యాల డివిజన్ ఆర్డీవో, వయోవృద్ధుల సంరక్షణ ట్రిబ్యునల్ చైర్మన్ పి. మధుసూదన్ అన్నారు. శుక్రవారం ఆర్డీవో చాంబర్ లో వివిధ గ్రామాలకు చెందిన వయోవృద్ధులైన తల్లిదండ్రులు నిరాదరణకు గురిచేస్తున్న తమ కుమారులు, కోడళ్ల పై సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ద్వారా ఆర్డీవో కు ఫిర్యాదులు చేశారు. జగిత్యాల రూరల్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన దండిగే బాలమల్లు (80) దండిగే లక్ష్మీ తదితరులు ఫిర్యాదులు చేస్తూ కొడుకులు, కొడళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. తల్లిదండ్రులను విస్మరిస్తున్న వారికి 6 నెలలకు పైగా జైలుశిక్ష విధించే వీలుందని, పోలీసు అధికారులు సైతం హింసించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారన్నారు. శనివారం జగిత్యాల మండలం గోవింద్ పల్లికి చెందిన ముల్లె నారాయణ, జగిత్యాల పట్టణానికి చెందిన బోక్కు సత్యనారాయణ కేసుల విచారణకు నోటీసులు జారీ చేశామన్నారు. ఏ.ఓ. తఫజుల్ హుస్సేన్, సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ తదితరులున్నారు.

## పరామర్శించి ఆర్థికసాయం అందజేసిన పొన్నం యువసేన తంగళ్ళపల్లి రమేష్

ఎల్కతుర్తి ఆగస్ట్ 02 (ప్రజామంటలు): ఎల్కతుర్తి మండలం జగన్నాథ్ పూర్ గ్రామంలోని వేల్పుల మధుకర్ ఇటీవల కాలంలో అనారోగ్య కారణాల వల్ల మృతి చెందగా వారి కుటుంబాని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేసి ఆర్థిక సాయం కింద 50 కిలోల బియ్యం ఆర్థిక సహాయం అందజేసిన పొన్నం యువసేన తంగళ్ళపల్లి రమేష్ పేదలకు అండగా తోడుగా ఉంటూ సహాయం చేస్తానని తెలిపిన రమేష్. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు ముస్కే శ్రీనివాస్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు పెండ్యాల భాస్కర్, చిర్రా సురేందర్, మాజీ ఉపసర్పంచ్లు ఆరేపల్లి సమ్మయ్య, ఆరేపల్లి రమేష్, సీనియర్ నాయకులు ఆరేపల్లి సమ్మయ్య, పెండ్యాల సామెల్, పెండ్యాల దేవదానం, ఆరేపల్లి ఎల్లయ్య, మాటూరు శ్రీనివాస్, కెంసారపు సంపత్, పెండ్యాల కృష్ణాకర్, పెండ్యాల స్వామి, మాడుగుల కోటి, మేడుదుల రవి. యూత్ సభ్యులు, పంజాల అభిలాష్. పంజాల అజయ్. తదితరులు పాల్గొన్నారు.





## సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం

సికింద్రాబాద్ ఆగస్ట్ 02 (ప్రజామంటలు): ఎస్సీ వర్గీకరణ కోసం కృషి చేసి, ఆ తర్వాత వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు రాగానే వెంటనే స్పందించి, రాష్ట్రంలో ఎబీసీడీ వర్గీకరణ అమలుపై ప్రకటన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. జబ్బర్ కాంప్లెక్స్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. డివిజన్ ప్రెసిడెంట్ ఐత చిరంజీవి, నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### హుస్నాబాద్ ప్రజల చిరకాల స్వప్నం

## 'గౌరవెల్లి ప్రాజెక్టు'

### వైయస్ హయాంలో ప్రారంభమై పొన్నం ప్రభాకర్ హయాంలో పూర్తి కానుంది



ఎల్కతుర్తి ఆగస్ట్ 02 (ప్రజామంటలు): హుస్నాబాద్ ప్రాంత ఎమ్మెల్యేగా గెలిచిన 8 నెలలకే నిధులు సాధించిన పొన్నం ప్రభాకర్. హుస్నాబాద్ ప్రాంత ప్రజల యొక్క చిరకాల స్వప్నమైన గౌరవెల్లి ప్రాజెక్టును గత కాంగ్రెస్ ప్రభుత్వం వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నంగా భావించే సాగునీరు తాగునీరు కొరకై ఆనాడు ప్రారంభించడం జరిగింది గత టిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల పాటు పూర్తి చేయకుండా ప్రాంత ప్రజల కోరికను తీర్చడంలో విఫలమైంది మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో గౌరవెల్లికి మంచి రోజులు వచ్చాయని కాంగ్రెస్ పార్టీ హుస్నాబాద్ ప్రాంతా ఎమ్మెల్యేగా గెలుపొందిన 8 నెలల లోపే ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రాంత ప్రజల అభ్యున్నతికై ఎలక్షన్ సమయంలో గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తానని హామీ ఇచ్చిన మేరకు పొన్నం ప్రభాకర్ అసెంబ్లీలో కొట్లాడి గౌరవెల్లి పూర్తి చేయడానికి అవసరమైన నిధులు 431 కోట్ల రిలీజ్ చేయడం హర్షించదగిన విషయమని కాంగ్రెస్ శ్రేణులు మండల వ్యాప్తంగా ఆనందంతో మండల కూడలిలో టపాసులు పేల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. మాది చేతల ప్రభుత్వమే కానీ ఉపన్యాసాలు ఇచ్చే ప్రభుత్వం కాదని ఈ ప్రాంత ప్రజలు పొన్నం ప్రభాకర్ ను గుండెల్లో పెట్టుకుంటారని యూత్ కాంగ్రెస్ ఎల్కతుర్తి మండల నాయకులు అంచనగిరి వెంకట్ పేర్కొన్నారు.

## ఎల్కతుర్తి మండలం దండేపల్లిలో చోరీ



ఎల్కతుర్తి ఆగస్ట్ 02 (ప్రజామంటలు): మండలంలోని దండేపల్లి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడిన దొంగలు లక్ష రూపాయల నగదు, 10 తులాల బంగారం అపహరించారు. ఇంటి యజమాని ఎల్కతుర్తి మండలం లోని బ్యాంకులో పెన్షన్ డబ్బులు తీసుకోవడానికి వచ్చినది. అదును చూసిన దొంగలు ఇంటి లోపల ఎవరూ లేరని గమనించి చొరబడ్డారు. నిందితుల కోసం పోలీసులు డాగ్స్ స్కార్డ్ ను పిలిపించి తనిఖీలు చేపట్టారు. వివరాలు తెలియాల్సి ఉంది.

## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల

గొల్లపల్లి ఆగస్ట్ 02 (ప్రజామంటలు): గొల్లపల్లి మండలలోని గడ్డం రాములు (వాచ్ రిపేర్) మల్లన్న పేట గ్రామంలో రోడ్డు ప్రమాదంలో ఇటీవల మరణించిన గాధం సురేష్ బొంకూర్ కు చెందిన కాంతారావు కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వీరి వెంట మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.





## గాంధీ ఆసుప్రతి లో బోనాల వేడుకలు

సికింద్రాబాద్ ఆగస్ట్ 02 (ప్రజామంటలు): గాంధీ ఆసుపత్రి టీఎన్జీవో యూనియన్ ఆధ్వర్యంలో ఆషాడ మాస బోనాల వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మెయిన్ బిల్డింగ్ నుంచి ఆసుపత్రి ఆవరణలో ఉన్న శ్రీబంగారు మైసమ్మ ఆలయం వరకు పోతరాజుల నృత్యాలు, డప్పు చప్పుళ్ళతో ఊరేగింపు నిర్వహించారు. బోనాలను నెత్తిన ఎత్తుకొని వెళ్ళిన గాంధీ మహిళ ఉద్యోగులు బంగారు మైసమ్మకు బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ఎన్ రాజకుమారి, ఆర్ఎంఓ%-%1 డా.శేషాద్రి, రాష్ట్ర టీఎన్జీవో ప్రెసిడెంట్ జగదీష్, జనరల్ సెక్రటరీ ముజీబ్ లు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల వేడుకల్లో ఆసుపత్రి ఏడీ ఫ్లోరెన్స్ మెర్లిన్, ఆఫీస్ సూపరింటెండెంట్ రామయ్య, హైదరాబాద్ టీఎన్జీవో సెక్రటరీ విక్రం, గాంధీ యూనిట్ ప్రెసిడెంట్ ప్రభాకర్, సెక్రటరీ ప్రసన్న, ప్రతినిధులు శ్రవన్, భావన, విశ్వనాథ్, జనార్ధన్, గాంధీ ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

## 30 ఏండ్ల మాదిగల కల నెరవేరిన రోజు ఇది..

### ఎమ్మార్పీఎస్ నేత రాగటి సత్యం బీజేఆర్ నగర్ లో సంబరాలు



సికింద్రాబాద్ ఆగస్ట్ 02 (ప్రజామంటలు): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ సనత్నగర్ నియోజకవర్గం బన్సీలాల్ పేట బీజేఆర్ నగర్ లో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా జీహెచ్ఎమ్సీ మల్టీపర్పస్ హాల్ వద్ద ఉన్న రాజ్యాంగనిర్మాత డా.బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వీట్లు పంచిపెట్టి, బాణాసంచా కాల్చారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాగటి సత్యం మాట్లాడుతూ.... మాదిగ, మాదిగ ఉపకులాలకు సమ న్యాయం జరిగేలా ఎస్సీ వర్గీకరణ కోసం 1994 జులై 7న ఒంగోలు ప్రారంభించబడిన ఎమ్మార్పీఎస్ ప్రస్థానంలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎన్నో పోరాటాలు చేశామన్నారు. ఈ పోరాటంలో 13 మంది మాదిగ సోదరులు ప్రాణాలు విడిచారని అన్నారు. అందరి పోరాట ఫలితం 30 ఏండ్ల సుధీర్ఘ ఉద్యమం తర్వాత ఈ రోజు మాదిగల కల ఫలించిందన్నారు. 50 లక్షల మాదిగలు పోరాటంలో పాలు పంచుకున్నారన్నారు. ఎస్సీ రిజర్వేషన్లను పకడ్బందీగా అమలు చేయాలని, ఏబీసీడీ వర్గీకరణ కోసం పోరాటం చేసిన అమరులకు ప్రతి ఒక్కరు నివాళులు అర్పించాలని కార్పొరేటర్ కుర్మ హేమలత లక్ష్మీపతి అన్నారు. మందకృష్ణ మాదిగకు, సుప్రీం కోర్టు న్యాయమూర్తులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఏబీసీడీ వర్గీకరణతో మాదిగ, మాదిగ ఉప కులాల బిడ్డలకు అటు విద్యా, ఇటు ఉద్యోగావకాశాల్లో న్యాయం జరుగుతుందన్నారు. 30 ఏండ్ల కల సాకారమైన ఈ రోజు పండుగ వాతావరణం నెలకొందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు మహేశ్, ఎస్.వై. గిరి, ప్రేమ్ కుమార్, కుర్మ శంకర్, సీపీ శంకర్, అబ్బాస్, నాగభూషణం, కుషాల్, తదితరులు పాల్గొన్నారు.

## మాదిగల చిరకాల కోరిక వర్గీకరణ

### వర్గీకరణకు ఎప్పుడు కాంగ్రెస్ అనుకూలమే అనేక సందర్భాల్లో తీర్మానాలు

### కాంగ్రెస్ పార్టీ చొరవతో ఎస్సీ వర్గీకరణ



ఎల్కతుర్తి ఆగస్ట్ 02 (ప్రజామంటలు): హనుమకొండ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పాలాభిషేకం చేసి ఎల్కతుర్తి మండలం కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గొర్రె మహేందర్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సి ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు దేశ అత్యున్నత న్యాయస్థానం 'సుప్రీం'కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం శుభపరిణామం అని విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ లకు కేటాయించిన రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేసే అధికారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది. 6.1 మెజారిటీతో సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును వెల్లడించింది గురువారం వర్గీకరణపై సుదీర్ఘ విచారణ జరిపిన ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ సమర్థనీయమని స్పష్టం చేశారు. ఈ వర్గీకరణను మెజారిటీ సభ్యులు సమర్థించగా జస్టిస్ బేలా త్రివేది మాత్రం వ్యతిరేకించారు. ఎస్సీలు చాలా వెనుకబడిన వర్గాల లీగా ఉన్నారని, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల వర్గీకరణ అవసరం ఉందని, వర్గీకరణచేసే వెసులుబాటు రాష్ట్రాలకు ఉండాలని సుప్రీం స్పష్టం చేసింది. ఈ మేరకు 2004లో ఐదుగురు సభ్యులు ఇచ్చిన తీర్పును తాజా తీర్పు తర్వాత ధర్మాసనం పక్కనబెట్టింది. ఈ తీర్పును అనుసరించి తదుపరి మార్గదర్శకాలను అనుసరించాలని ప్రభుత్వాలకు న్యాయస్థానం సూచించింది ఎన్నో త్యాగాల పునాదుల మీద ఎంతోమంది మాదిగలు వర్గీకరణ కోసం వారు ప్రాణాలు పోగొట్టుకున్నారని వారిని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణకు అనుకూలమని తీర్మానాలు చేపట్టి సుప్రీంకోర్టులో కూడా వర్గీకరణ చేపట్టాలని కూడా పిట్టీషన్ దాఖలు చేశారని కాంగ్రెస్ పార్టీ చొరవతోనే వేగవంతంగా సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి అంతిమంగా వర్గీకరణ న్యాయబద్ధమైన డిమాండ్ అని సిగ్నల్ ఇచ్చిందని ఈ సందర్భంగా తెలిపారు.



## సరస్వతి శిశు మందిర్ లో గోరింటాకు ఉత్సవం

మహాదేవపూర్ ఆగస్ట్ 02 (ప్రజామంటలు): స్థానిక శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చిన్నారి విద్యార్థులతో గోరింటాకు ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థుల చేతులకు గోరింటాకును ఉపాధ్యాయులు అలంకరించారు. గ్రీష్మ ఋతువు నుండి వర్ష ఋతువులోకి ప్రవేశిస్తున్న సందర్భంలో శరీరంలోని వేడిని సమతుల్యం చేసి జీవరసాయన క్రియలను నియంత్రిస్తుందని ప్రధానాచార్య నూక కృషిధర్ తెలిపారు. సనాతన కాలం నుండి గోరింటాకు వాడకం హిందూ సంస్కృతిలో చిరస్థాయిగా నిలిచి ఉందని ఆయన పేర్కొన్నారు. సౌందర్య సాధనలో ఆరోగ్య పరిరక్షణలో మహిళలకు గోరింటాకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒక వేడుక వలె గోరింటాకు ఉత్సవాన్ని నిర్వహించారు.

## కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన కొండగట్టు ఆలయ ఈ.ఓ. రామకృష్ణ

జగిత్యాల ఆగస్ట్ 02 (ప్రజామంటలు): జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ను కలెక్టర్ ఛాంబర్ లో కొండగట్టు ఆలయ ఈ.ఓ. రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిసి స్వామి వారి ప్రసాదాన్ని అందజేసారు. అనంతరం కొండగట్టు ఆలయ అర్చకులు కలెక్టర్ ను ఆశీర్వదించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం నూతన ఈ.ఓ. గా నియామకమైన ఎల్. రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు.



## భార్యపై అనుమానంతో ఉరి వేసుకున్న భర్త



భీమదేవరపల్లి ఆగస్ట్ 02 (ప్రజామంటలు): అనుమానమే పెనుభూతమై... ఆత్మహత్య చేసుకున్న యువకుడు... భార్యాభర్తల మధ్యన అనురాగానికి బదులు అనుమానం అనే భూతం దరిచేరడంతో ఓ యువకుడి ప్రాణాన్ని కబళించిన సంఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దండం రాజు (27) అనే వ్యక్తి భార్యపై అనుమానంతో, మనస్థాపంతో ఉరి వేసుకొని మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు, దండ రాజుకు రవళి అనే అమ్మాయితో వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గత కొంతకాలంగా భార్య రవళి పై అనుమానం పెంచుకొని మనస్తాపానికి గురైయ్యాడు. దీంతో తరచుగా భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు పెరిగాయి. ఈ క్రమంలో శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

## రైతులకు "ఇలా" అగ్రి వారి డ్రోన్ సేవలు..



భీమదేవరపల్లి ఆగస్ట్ 02 (ప్రజామంటలు): మండల రైతులకు వరి, మొక్కజొన్న లాంటి పంటలపై తక్కువ ఖర్చుతో పిచికారి చేసేందుకు "ఇలా" అగ్రివారు రైతులకు అందుబాటులో డ్రోన్ సేవలను అందిస్తున్నారు. కూలీల కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన "ఇలా" అగ్రి ఆధ్వర్యంలో శుక్రవారం నుండి డ్రోను సేవలను గట్ల నర్సింగాపూర్ లో ప్రారంభించారు. ఈ డ్రోన్ తో పంటలపై మందులు పిచికారీ చేయటం వలన రైతులకు శ్రమతో పాటు, 80% నీరు, 30% మందుల ఖర్చు ఆదా అవుతుందని "ఇలా" కంపెనీ మేనేజర్ ప్రకాష్ తెలిపారు. డ్రోన్ సేవల కొరకు రైతులు 9989177123 ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

## తల్లి పాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన



జనగామ ఆగస్ 02 (ప్రజామంటలు): జనగామ పట్టణంలోని సంజయ్ నగర్ అంగన్ వాడి కేంద్రం లో తల్లి పాల ప్రాముఖ్యత గురించి తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సంవత్సరం అంతరాలను తొలగిద్ధాము తల్లి పాల ప్రాముఖ్యతను చాటుదాం అనే అంశంపై ప్రతి గర్భిణిలకు, బాలింతలకు, కిషోర బాలికలకు, తల్లులకు, అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పానుగంటి సువార్త, సౌడ శాంతి, అంగన్ వాడి టీచర్లు మేకల రేణుక, ఆర్. జయ, ఈ. భారతి, వై. జ్యోత్స్న, పి విజయ (ఆయా) ఎన్ గ్లోరీ, జి. రత్నమ్మ, తల్లులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని స్వాగతిస్తున్నాము

**బి.ఆర్.ఎస్.వి. శాతవాహన యూనివర్సిటీ ఇంచార్జ్ చుక్క శ్రీనివాస్**



చిగురుమామిడి ఆగస్టు 02 (ప్రజామంటలు): ఇది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవనే..గతంలో పలుమార్లు కేంద్ర ప్రభుత్వంకు విన్నవించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిండు శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లును తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించి ఆమోదించిన బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కృషి అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని స్వాగతిస్తున్నామని, వర్గీకరణ సమర్ధనీయమని దీనిపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కలిపిస్తూ ఆదేశాలు జారీ చేసిన సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు బీఆర్ఎస్వి శాతవాహన యూనివర్సిటీ ఇంచార్జ్ చుక్క శ్రీనివాస్ అన్నారు. దశాబ్దాల నుంచి ఎస్సీ వర్గీకరణ సాధనకై కృషి చేస్తున్న పోరాట యోధుడికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# తాజా మాజీ సర్పంచుల గోస

# ఆగమ్యగోచరంగా సర్పంచుల పరిస్థితి

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జే.ఎస్.ఆర్**






ఎల్కతుర్తి ఆగస్ట్ 02 (ప్రజామంటలు): పెండింగ్ బిల్లులు చెల్లించాలని తెలంగాణ సర్పంచ్ ల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఛలో సెక్రటేరియట్ కార్యక్రమానికి పిలుపునిచ్చిన తాజా మాజీ సర్పంచ్ లను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. అరెస్టు అయిన తాజీ మాజీ సర్పంచ్ లను తిరుమలగిరి లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి పోలీస్ స్టేషన్ లో కలసి వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయి దాదాపు 7 నెలలు కావస్తున్నా తాజా మాజీ సర్పంచ్ ల పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడం శోచనీయమని అన్నారు. అధికారంలోకి వస్తే సర్పంచ్ లను అదుకుంటామని చెప్పి నేడు కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు.గ్రామ అభివృద్ధి కోసం సర్పంచ్ లు తమ సొంత నిధులతో అభివృద్ధి పనులు చేసి అప్పుల పాలు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయంలో పలువురు సర్పంచులు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న దాఖలాలున్నా యాన్నారు. 2019-2024 సంవత్సరానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించిన తరువాతే పంచాయితీ ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. వారికి తాము అండగా నిలుస్తామని, పెండింగ్ బిల్లులు చెల్లించని పక్షంలో రానున్న రోజుల్లో కార్యాచరణ రూపొందించి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అరెస్టయిన వారిలో ఎల్కతుర్తి మండలానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ లు అరేపల్లి రామారావు, పెంచిలపేట సామల సురేష్ రెడ్డి, చింతల పల్లి అనితా రాజు, కోతులనడుమ రజిత దేవేందర్ రావు, సురారం సాంబమూర్తి తదితరులు ఉన్నారు.

## గ్రూప్-1 అభ్యర్థి 'శేఖర్' కు మొబైల్, ట్యాబు వితరణ




నవాబుపేట ఆగస్ట్ 02 (ప్రజామంటలు): హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రూప్-1 అభ్యర్థికి మొబైల్ ట్యాబును వితరణ గావించారు. టిజిపిఎస్సి గ్రూప్ 1 అభ్యర్థి బేగరి శేఖర్ కు గుమ్మడి అనుపమ 8500, పుష్ప 5,000 దాతల సహకారంతో మొత్తం 13,500 విలువగల ఎం 10 మోడల్ లెనొవో ట్యాబును అందించినట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు.ఈ సందర్భంగా రవి నాయక్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా నవాబుపేట మం గంగుడా గ్రామంలో నివాసితులు శేఖర్ కుటుంబ నేపథ్యం లక్ష్మయ్య కౌలు రైతు ముగ్గురు కూతుర్లు, ఒక కొడుకు ఆర్థిక ఇబ్బందులతో కష్టపడి చదివించి తెలంగాణ నిర్వహించిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 ప్రిలిమినేరీ రాత పరీక్షల్లో 150/80 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. మెయిన్స్ ఎగ్జామ్ కోసం ప్రిపరేషన్ అయ్యేందుకు మొబైల్ ట్యాబు ఎంతో అవసరం పడుతుందని తెలియజేయడంతో దాత అనుపమ, పుష్ప ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తూ సామాజిక బాధ్యతగా ముందుకొచ్చి శేఖర్ కు ట్యాబును అందజేశారు. ట్యాబును అందించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ మూడే లక్ష్మీదేవి, అసిస్టెంట్ ఇంజనీర్ సౌమ్య, కాసు హారిక, శ్రీనివాస్, పవన్, కరుణాకర్ పాల్గొన్నారు.

## అసంపూర్తిగా ఉన్న మోడల్ మార్కెట్ ను

# వెంటనే పూర్తి చేయాలి



జనగామ ఆగస్ట్ 02 (ప్రజామంటలు): అసంపూర్తిగా ఉన్న మోడల్ మార్కెట్ ను వెంటనే పూర్తి చేయాలని జనగామ అమ్మ ఫౌండేషన్ ప్రభుత్వాన్ని కోరింది. శుక్రవారం మోడల్ మార్కెట్ ను సందర్శించిన జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజు మాట్లాడుతూ జనగామ పట్టణంలోని జనగామ రైల్వే స్టేషన్ వద్ద ఉన్న కూరగాయల మార్కెట్ చాలా చిన్నదిగా ఉండటం వల్ల దానిని అప్పటి ప్రభుత్వం మోడల్ మార్కెట్ ను సంజయ్ నగర్ ప్రాంతంలో మోడల్ మార్కెట్ ప్రారంభించారు. మోడల్ మార్కెట్ పూర్తి బడ్జెట్ ఎంత బడ్జెట్లో కేటాయించారు. ఇంకా ఎంత పెండింగ్ ఉంది? తెలపాలన్నారు. ప్రస్తుత మోడల్ మార్కెట్ పరిస్థితి చెట్లు పెరిగి అసంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. లోపల మద్యం బాటిల్లు గ్లాసులు దర్శనమిస్తున్నాయి. ఎలాంటి సెక్యూరిటీ లేదు ఆ మోడల్ మార్కెటు షెటర్స్ ఉన్నాయి. షట్టర్స్ వేసి తాళం వేస్తే బాగుంటుంది సెక్యూరిటీ కల్పిస్తే బాగుంటుంది అని అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలో ఉన్న ఎంతో ఉపయోగకరంగా రైతులకు వ్యాపారులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది కాబట్టి మానవత దృక్పథంతో ఆలోచించాలని, వెంటనే ఈ సమస్యను పరిష్కరించి చిరు వ్యాపారులకు అండగా నిలవాలని, ప్రజలకు కూరగాయలు తక్కువ ధరలో మంచివి అందేలా చూడాలని జిల్లా అధికారులను కోరారు. జనగామ జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ చైర్మన్ ఒకసారి సందర్శించి మోడల్ మార్కెట్ పూర్తి చేయడానికి ఇంకా ఎంత బడ్జెట్ కావాలి రిలీజ్ చేసి చిరు కూరగాయల వ్యాపారులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు లకన్ సింగ్ చందు తదితరులు పాల్గొన్నారు.

## కరెన్సీ పై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కు డా. పరశురామ్ వినతి



జనగామ ఆగస్ట్ 02 (ప్రజామంటలు): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్తి ప్రదాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఫోటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని కేంద్ర విమానాయశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కి న్యూఢిల్లీ సర్దార్ గంజ్ విమానాశ్రయం రాజీవ్ భవన్ లో కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విమానాయ శాఖ కేంద్ర మంత్రి నాయుడు మాట్లాడుతూ.... ఇది న్యాయమైన డిమాండ్. ఇది వాస్తవం ఈ అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి పార్టీ ఎంపీలు పార్లమెంట్లో మాట్లాడేలా కృషి చేస్తాం. ప్రధానమంత్రి దృష్టికి తీసుకు వెళ్తాం అని ఆయన హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరెన్సీ పై అంబేద్కర్ ఫొటో సాధన సమితి ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షుడు కంఠ వేణు జాతీయ జాతీయ నాయకులు అతవ ఉదయ భాస్కర్, గురుమూర్తి కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



## రోజురోజుకీ దర్గాకు పెరుగుతున్న భక్తులు

**రహదారి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్న భక్తులు**

వేలేరు ఆగస్ట్ 02 (ప్రజామంటలు): వేలేర్ మండల కేంద్రంలోని చెరువు కట్ట పైన ఉన్న చారిత్రక దర్గా హజ్రత్ షేక్ ఫరీదోద్దీన్ బాబా దర్గా వద్దకు కుల మతాలకు అతీతంగా ప్రతి శుక్రవారం రోజున తెలంగాణ లోని జిల్లాల నుంచి మొక్కులు చెల్లించుకోవడం కోసం భక్తులు వస్తున్నారు. దర్గాకు రహదారి సౌకర్యం కరువైందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భక్తులు మాట్లాడుతూ దర్గాను దర్శించుకుని మరియు ఇక్కడ ఉన్న శివాలయం, హనుమాన్ దేవాలయం, పోచమ్మ దేవాలయాలను దర్శించుకుంటున్నారు. ప్రభుత్వం వెంటనే పట్టించుకోని దేవాలయం వద్ద అభివృద్ధి పనులు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

## తల్లిపాల వారోత్సవం




ఇబ్రహీంపట్నం ఆగస్ట్ 02 (ప్రజామంటలు): ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ గ్రామంలో గర్భిణీలకు బాలింతలకు తల్లిపాలు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. 9 నెలలు పడిన గర్భిణి డెలివరీ అవ్వగానే ఒక గంట తర్వాత తల్లిపాలు పట్టించాలని చెప్పడం జరిగింది. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలి ముర్రు పాలు తాగించడం ద్వారా బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది మరియు మానసికంగా శరీరకంగా ఎదుగుదల జరుగుతుంది. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం కాబట్టి దాన్ని దృష్టిలో ఉంచుకొని బాలింతలు తమ పిల్లలకు తల్లిపాలు ఇవ్వాలని అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, మాధవి, డాక్టర్ ఏఎన్ఎం భవాని, అంగన్వాడీ టీచర్స్ చిన్నగంగు, త్రివేణి. పద్మావతి, నీలిమ మరియు వివో లు అప్సర, లక్ష్మి, రుక్షాన, కారోబార్ సుమంత్, ఆశలు వినోద, సుప్రియ, వనిత, ప్రమీల పాల్గొన్నారు.



## అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన ఎల్కతుర్తి మండల సర్పంచులు

ఎల్కతుర్తి ఆగస్ట్ 02 (ప్రజామంటలు): ఎల్కతుర్తి మండల సర్పంచ్లు బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన మండల సర్పంచులు ముందస్తు అరెస్టులను ముందుగానే గమనించి అసెంబ్లీకి చేరుకున్నారు. ధర్నా చేస్తున్న క్రమంలో పోలీసులు వీరందరినీ అరెస్టు చేశారు. అనంతరం సంఘీభావం తెలిపిన బిజెపి నాయకులు టిఆర్ఎస్ నాయకులు వచ్చి వీరికి సంఘీభావం తెలిపారు. వీలైనంత త్వరగా బిల్లులు చెల్లించని యెడల ముందస్తు కార్యచరణ దాల్చి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని గల మెత్తారు. వీరిలో ఎల్కతుర్తి మండల సర్పంచులు బూర్గుల రామారావు అనిత రాజు సురేష్ రెడ్డి సామమూర్తి గౌడ్ దేవేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల స్థలాల కోసం జర్నలిస్టుల ఉద్యమం

## మూడో రోజు మానవహారం, కలెక్టరేట్ ఎదుట నిరసన కలెక్టర్ కు వినతి పత్రం







జగిత్యాల ఆగస్ట్ 02 (ప్రజామంటలు):

ఇండ్ల స్థలాల కోసం గత మూడు రోజులుగా వివిధ రూపాల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్న జర్నలిస్టుల ఉద్యమం శుక్రవారం జిల్లా కేంద్రంలోని తహశీల్ చౌరస్తా వద్ద మధ్యాహ్నం 12 గంటలకు మానవహారంగా ఏర్పడి ఆందోళన చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఇండ్ల స్థలాల కోసం ఎందరో ప్రజాప్రతినిధులకు తాము వినతి పత్రాలు అందజేశామని అయినా తమను పట్టించుకున్న పాపాన ఏ నాయకులు పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులను కలిసినప్పుడు మేము గెలిచిన తర్వాత మీకు ఇండ్ల స్థలం ఇప్పిస్తామని హామీ ఇవ్వడం తప్ప ఇప్పటివరకు ఇళ్ల స్థలాల ఊసే ఎత్తకపోవడం తమను బాధకు గురి చేసిందని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో గాని తెలంగాణ వచ్చిన తర్వాత అన్ని ప్రాంతాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చినప్పటికీ జగిత్యాలలో మాత్రం ఇప్పటివరకు ఏ ఒక్క జర్నలిస్టుకు ఇండ్ల స్థలం ఇవ్వలేదని గుర్తు చేశారు. ఇండ్ల స్థలాలను సాధించేవరకు వివిధ రూపాల్లో నిరసనలతో ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ఏ ఒక్క స్థానిక ప్రజా ప్రతినిధి తమ సమస్యను గుర్తించి తమకు సహకరించడానికి ముందుకు రాకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్ తమ వినతికి సానుకూలంగా స్పందించి తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వచ్చేలా ప్రయత్నం చేస్తానని తెలుపడం ఆనందదాయకంగా ఉందని అన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా తమ సమస్యను గుర్తించి తమకు ఇండ్ల స్థలాలు వచ్చేలా కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.



# గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

జగిత్యాల జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 02 (ప్రజామంటలు):

జగిత్యాల మేడిపల్లి మండలం కొండాపూర్ శివారు ప్రాంతంలో గంజాయి విక్రయించేందుకు వచ్చిన యువకుడి పోలీస్లు అరెస్ట్ చేసినారు. వారి వద్ద నుండి 565 గ్రాముల గంజాయి, సెల్ ఫోన్, బైక్ ను మేడిపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు శేఖర్ (35) నిజామాబాద్ జిల్లా కమ్మరిపెల్లి మ. కొనాపూర్ లో కిరాణం షాప్ నిర్వహిస్తూ అధిక ఆదాయం కోసం గంజాయి అమ్ముతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాలు అరికట్టవచ్చు

## రైతులకు అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్కో డీఈ రాజిరెడ్డి

గొల్లపల్లి ఆగస్ట్ 02 (ప్రజామంటలు):

విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ ట్రాన్స్కో డీఈ రాజిరెడ్డి సూచించారు. శుక్రవారం గొల్లపల్లి మండల కేంద్రంలో పొలం బాట కార్యక్రమంలో భాగంగా రైతులకు విద్యుత్ ప్రమాదాల భారిన పడకుండా రైతులకు, ప్రజలకు సూచనలు ఇస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలతో భూమి పూర్తిగా తడిసిపోయి ఉంటుందని, దీనికి తోడు గాలి దుమారం తో విద్యుత్ తీగలు తెగిపడతాయని, స్తంభాల వద్ద పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు, రైతులు తమ వ్యవసాయ కనెక్షన్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని దాని ద్వారా మోటర్లు కాలిపోకుండా ఉంటాయని సూచించారు, రైతులు



పొలాల్లో కరెంటు స్టార్టర్లకు ఇనుప డబ్బాలు కాకుండా ఫైబర్ డబ్బాలతో అమర్చుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ ట్రాన్స్కో ఏడీఈ వరుణ్ కుమార్, ఏఈ దివాకర్ రావు, సబ్ ఇంజనీర్ దామోదర్, సీనియర్ల లైన్ ఇన్స్పెక్టర్ రమణ, లైన్ ఇన్స్పెక్టర్ రాజు, విద్యుత్ సిబ్బంది అనిల్, శేఖర్ రైతులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం, నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

## బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ మాదిగలకు అండగా ఉంటుంది





వేలేర్ ఆగస్ట్ 02 (ప్రజామంటలు):

వేలేరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ,వేలేరు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తదనంతరం డాక్టర్ రాజయ్య గారు మాట్లాడుతూ "30 ఏళ్ల మందకృష్ణ మాదిగ గారి కృషికి నేడు ఫలితం లభిం చింది. .ఆనాడు ఎమ్మార్పీఎస్ స్థాపించినప్పటి నుంచి నేను కూడా మందకృష్ణ మాదిగ గారితో కలిసి తెలంగాణ రాష్ట్రం మొత్తం తిరిగి, ఆనాడు ఎన్నో పోరాటాలు చేసాము... ఈరోజు సుప్రీంకోర్టు తీర్పు అనుకూలంగా వెలువడిన తరుణంలో 30 ఏళ్ల కళ నెరవేరినట్టుగా ఆనాటి ఎన్నో మధురస్మృతులను గుర్తు చేసుకుంటున్నాను... మరీ ముఖ్యంగా ఈ యొక్క వర్గీకరణ అమలులో లభించిన తీర్పును ఎంతోమంది అమరులైనటువంటి మాదిగ బిడ్డలకు, పోరాటలు చేసి జెళ్ళ పాలైనటువంటి ప్రతి ఒక్క మాదిగ బిడ్డకు ఈ యొక్క గెలుపును అంకితం చేస్తున్నాము. మరి ముఖ్యంగా 2014లో టిఆర్ఎస్ పార్టీ తరపున శాసనసభలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తీర్మానాన్ని ప్రవేశపెట్టే అదృష్టం నాకే లభించింది దాంతోపాటు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి ఉప ముఖ్యమంత్రిగా మాదిగ బిడ్డ అయినా నాకే గౌరవం లభించింది. కాబట్టి ఎప్పటికైనా బీఆర్ఎస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీ మాదిగలకు అండదండగా ఉంటుంది. నిన్నటి రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో అన్ని రాష్ట్రాల కంటే ముందు తెలంగాణ రాష్ట్రంలోనే ఈ యొక్క వర్గీకరణ బిల్లును అమలు చేస్తాం అని మాట ఇచ్చారు. మాటల ప్రభుత్వంగా కాకుండా కచ్చితంగా అన్ని రాష్ట్రాల కంటే ముందు తెలంగాణలోని అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని నేను ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను అలా జరిగితే ఎంతోమంది మాదిగ బిడ్డలు అన్ని రంగాల్లో రాణిస్తారు కావున వెంటనే ఆ వర్గీకరణ రాష్ట్రవ్యాప్తంగా అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని నేను ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాను. రాబోయే కాలంలో బీఆర్ఎస్ పార్టీ మాదిగలకు ఎప్పటికీ అండ దండగా ఉంటుందని తెలియజేస్తూ మరొకసారి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాదిగ సోదరులందరికీ అభినందనలు తెలియజేస్తున్నాను అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వేలేరు మండల మాజీ జెడ్పిటిసి చాడ సరిత, విజేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీ సంధ్య భూపతి,వైస్ ఎంపీపీ సంపత్ నాయక్, మండల యువత అధ్యక్షుడు గోవిందు సురేష్,మహేందర్, కళ్యాణ్,కరుణాకర్, కొ ఆప్షన్ సభ్యులు జాని పాషా మరియు అందుబాటులో ఉన్న పార్టీ శ్రేణులు, దళిత నాయకులు కార్యకర్తలు యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ స్ఫూర్తితో "దూదేకుల హక్కుల" కోసం పోరాటం

**తక్షణమే దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి**

**దూదేకుల ను బీసీ బీ నుండి బీసీఈ లో చేర్చాలి**

**మైనారిటీ కార్పొరేషన్ ద్వారా దూదేకులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి**

**ఆల్ బీసీ మైనారిటీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అంకూస్ డిమాండ్**



జమ్మికుంట ఆగస్ట్ 02 (ప్రజామంటలు):

30 సంవత్సరాల కళ నెరవేరిన సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ కి శుభాకాంక్షలు తెలుపుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం, గుర్తింపు కోసం దూదేకుల కులస్తుల డిమాండ్ కోసం మందకృష్ణను స్ఫూర్తిగా తీసుకొని పోరాటానికి సిద్ధపడాలని, ఎవరో వస్తారు ఏదో చేస్తారు అని అనుకోని కూర్చుంటే మనం మన హక్కులు సాధించుకోవడం కష్టతరం అవుతుందని ప్రతి ఒక్కరూ తమ యొక్క హక్కు సాధన కోసం పోరాట పంతాను ఎంచుకోవాలని. ముస్లిం సామాజిక వర్గంలో అత్యంత వెనుకబడిన దూదేకుల కులస్తుల పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో చాలా అధ్వానంగా మారిందని. అసలు దూదేకుల అనే ఒక కులం ఉందనేటువంటి పరిస్థితి కూడా ప్రభుత్వ పెద్దలకు తెలియనటువంటి స్థితి ఉన్నది. పేరుకు మాత్రమే ముస్లిం కానీ రిజర్వేషన్ పరంగా మాత్రం బీసీ బి అవకాశం కల్పించడం జరిగింది. అత్యంత వెనుకబడిన కులాన్ని బీసీ బీలో చేర్చడం వల్ల ప్రభుత్వపరంగా ఉద్యోగాలపరంగా, విద్యార్థులకు సీట్లు పొందే క్రమంలో చాలా రకాలుగా ఇబ్బందులకు గురి అవుతున్నటువంటి పరిస్థితి ఉన్నది, పేరుకు మాత్రమే ముస్లిము కానీ రిజర్వేషన్ పరంగా మాత్రము దాదాపు హిందువుల్లో ఫార్వర్డ్ క్యాస్ట్ తో సమానంగా చూడటం జరుగుతున్నది. ముఖ్యంగా దూదేకుల కులస్తులు బ్యాండు భజంత్రీలు వాయిస్తూ, పాత ఇనుప సామాన్, పండ్ల వ్యాపారం, పూల వ్యాపారం, స్కూటర్ మెకానిక్, చిన్నచిన్న హోటల్స్, చికెన్ సెంటర్స్ లలో పనిచేస్తూ కడు బీదరికంలో జీవిస్తున్నారు. అటు ముస్లిమ్ అని చెప్పుకోలేక ఇటు హిందువు అని చెప్పుకోలేక బ్రతక లేనటువంటి పరిస్థితి ఉంది. దూదేకుల కులాన్ని చైతన్యవంతం చేయడం కోసం ఎందరో నాయకులు ప్రయత్నం చేసినప్పటికీ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలంగా లేని కారణంగా ఉద్యమాన్ని మధ్యలోనే వదిలేసినటువంటి పరిస్థితి ఉన్నది. ఇప్పుడు ఉన్నటువంటి పరిస్థితులలో మీడియా ద్వారా, సోషల్ మీడియా ద్వారా సమాచారాన్ని ప్రపంచవ్యాప్తంగా చేరవేసే పరిస్థితి ఉన్నందున మనకు కావలసినటువంటి హక్కుల కోసం, మనకు చెందాల్సినటువంటి వాటా కోసం, అలాగే దూదేకుల కులానికి కార్పొరేషన్ ఏర్పాటు కోసం ఉద్యమించాలని. దీనికి అందరికీ ఏదో రకంగా ఉద్యమం చేసి ముందుండి నడిచే అటువంటి మాలాంటి నాయకులకు అండగా నిలిచి మన హక్కులు సాధించుకోవాలని కోరుచున్నాము. "అడగందే అమ్మయినా అన్నం పెట్టదు" అనే సామెత అందరికీ తెలిసిందే దూదేకుల కులస్తులు తమకు రావలసిన వాటా కోసం పోరాటం చేయంది ఎవరు మనల్ని పిలుచుకొని ఇవ్వరని గుర్తించి కులం కోసం ప్రయత్నం చేస్తున్నటువంటి వ్యక్తులకు సహకరించాల్సిందిగా కోరుచున్నాము. రాష్ట్రవ్యాప్తంగా దూదేకుల కుల కులస్తులను ఐక్యం చేయడం కోసం ఒక ఉమ్మడి జేఏసీ ని ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి మన సమస్యలను తీసుకుపోవడానికి ప్రయత్నం చేస్తున్నామని దీనంతటికీ మీరు సహకరించాలని దూదేకుల కుల సహోదరులను వేడుకుంటున్నాం.

# ఆగస్ట్ 1 నుండి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు



జమ్మికుంట ఆగస్ట్ 02 (ప్రజామంటలు):

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వావిలాల పరిధిలోని అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు ఆగస్టు ఒకటవ తేదీ నుండి ఏడవ తేదీ వరకు జరుగును అందులో భాగంగా మడిపల్లి, శంభునిపల్లి కోరపల్లి జమ్మికుంట టు ఆరోగ్య ఉప కేంద్రాలలోని అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు మరియు జిల్లా కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శుక్రవారం సభ జరిగింది ఈ సందర్భంగా పాలిచ్చే తల్లులకు తల్లిపాల అవశ్యకతను శిశువు జన్మించిన నాటి నుండి ఆరు నెలల వరకు ప్రత్యేకంగా తల్లిపాలు ఇవ్వాలని ఒకవేళ తల్లిపాలు రానప్పుడు వైద్యులు సూచించిన ఫార్ములా పాలను వాడాలని తల్లులు సరైన పోషకాహారం తీసుకుంటూ చనుబాల ఉత్పత్తిని పెంచుకోవాలని ఆరు నెలల తర్వాత ఇతర ఆహార పదార్థాలను శిశువుకు అందిస్తూ తల్లిపాలను సంవత్సరం వరకు కొనసాగించాలని తల్లిపాలు తాగితేనే శిశువుకు సరైన పోషణ లభిస్తుంది రోగనిరోధక శక్తి పెరుగుతుంది శిశువు ఆరోగ్యంగా ఉంటారు కాబట్టి చనుబాలు ఇవ్వడమే మొదటి ప్రాధాన్యతగా భావించాలని మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని గర్భిణీలు బాలింతలు అంగన్వాడి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, డ్రై డే పాటించడం వల్ల అనారోగ్య సమస్యలు దరి చేరవని ప్రభుత్వ ఆసుపత్రుల ను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. అలాగే వర్షాకాలంలో సంభవించే వ్యాధుల మీద వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత డ్రైడే మీద అవగాహన కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో డాక్టర్స్ సంధ్య, హిమబిందు. మహెూన్నత. మోహన్ రెడ్డి హెల్త్ ఎడ్యుకేటర్, సూపర్వైజర్ అరుణ, సదానందం, అంగన్వాడి సూపర్వైజర్ శిరీష, ఏఎన్ఎం వనజ, సంధ్య రజిత మణెమ్మ మంజుల అంగన్వాడి సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల లో వైద్య శిబిరం

ఈరోజు జమ్మికుంట పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ( బాలురు )ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది గురుకుల పాఠశాల (బాలురు) లో సుమారు 330 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగింది ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత మరియు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ డిసీజెస్ (వర్షాకాలంలో సంభవించే వ్యాధుల) మీద డ్రై డే మీద అవగాహన కల్పించడం జరిగింది,చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్న విద్యార్థిని విద్యార్థులకు మందులు ఇవ్వడంజరిగింది. ఇప్పటివరకు మొదటి దశ ఆరోగ్య శిబిరాలు మండలంలోని అన్ని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలలో పూర్తి చేయడం జరిగింది.వర్షాకాలం దృష్ట్యా తరచుగా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ మహెూన్నత, పాఠశాల ప్రిన్సిఫాల్ లచ్చయ్య సూపర్వైజర్ రత్నకుమారి, ఏఎన్ఎం మంజుల, రజిత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పాపన్న జయంతి ఉత్సవాలు ప్రారంభం



వేలేరు ఆగస్ట్ 02 (ప్రజామంటలు):

వేలేర్ మండల కేంద్రంలో బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం వేలేరు మండల కేంద్రంలో గీతా పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి పాపన్న జయంతి ఉత్సవాల కార్యక్రమాన్ని బుర్ర శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గడ్డం వీరన్న గౌడ్ పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి కల్లు గీత కార్మిక సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలని, ప్రతి గ్రామంలో గౌడ, గీతా కార్మికులు వారి సొసైటీ ఆధ్వర్యంలో పాపన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ, సంఘానికి సేవలు అందించిన అమరులను స్మరించుకోవాలని ఆయన కోరారు. కల్లుగీత కార్మిక సంఘం పోరాట ఫలితంగానే గీతా కార్మికుల పెన్షన్, ఎక్స్గ్రేషియా పెంపు జరిగాయని, నీరా ప్రాజెక్టు నెలకొల్పడం జరిగిందని, అందరికీ సేఫ్టీ మొక్కులు త్వరలో రాబోతున్నాయని ఆయన తెలిపారు. అనంతరం గీత వృత్తి సంరక్షణ కోసం గౌడ, గీతా కార్మికులు కృషి చేయాలని, గౌడ బిడ్డ అయిన ప్రతి ఒక్కరూ వారి ఇళ్లలో శుభకార్యం పురస్కరించుకుని పుట్టినరోజు, పెళ్లి రోజుకు జీవితంలో ఒకసారి మాత్రమే ఒక పది తాటి, ఈత మొక్కలు నాటి వృత్తిని రక్షించాలని గౌడ, గీతన్న ప్రతిజ్ఞను చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మోడెం రాజేందర్ గౌడ్, కత్తి సాంబరాజు గౌడ్, సారా వెంకటేష్ గౌడ్, జనగాని సాయి కుమార్ గౌడ్ వేలేరు గౌడ సంఘం అధ్యక్షులు బైరు కుమార్ స్వామి వేలేరు గౌడ సంఘం సభ్యులు బైరి శ్రీనివాస్, సారా సుమన్, సారా సతీష్, బొల్లికొండ రాజు, గుజ్జేటి కనకయ్య, బైర వీరస్వామి, సార రాజశేఖర్, గడ్డం రమేష్, ముంజ వెంకటేష్, వినయ్, బుర్ర రాజు, సారా నారాయణ, కత్తి రాజేష్, గౌడ సంఘ సభ్యులు పాల్గొన్నారు.